Follow: @ANNTELUGU
31-03-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 93 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నక్సల్స్ రహిత భారత్

### అభివృద్ధిలో నక్సల్స్ నేతలు భాగస్వాములు కావాలి
### డెడ్‌లైన్ ముందు అమిత్ షా ప్రకటన

**ఢిల్లీ, మహా:** దేశ అంతర్గత భద్రతకు పెనుసవాలుగా మారిన నక్సలిజం ఇప్పుడు తుది దశకు చేరుకుందని, హింసా మార్గాన్ని నమ్ముకున్న వారు తక్షణమే ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంభీరంగా హెచ్చరించారు. లోక్‌సభ వేదికగా నక్సలిజం నిర్మూలనపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దాలుగా రక్తపాతంతో తడిసిన బస్తర్ గడ్డపై ఇప్పుడు శాంతి కపోతాలు ఎగురుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పుడు నక్సలైట్ల కోటగా భావించిన బస్తర్ ప్రాంతంలో ఇప్పుడు వారి ఉనికి దాదాపు నామమాత్రమైందని, ఇది కేవలం సైనిక చర్యల వల్లనే కాకుండా ప్రభుత్వ సంకల్పం మరియు అభివృద్ధి పనుల వల్ల సాధ్యమైందని ఆయన వివరించారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న బహుముఖ వ్యూహం సత్ఫలితాలను ఇస్తోందని అమిత్ షా పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అగ్రశ్రేణి నక్సల్స్ నాయకులు పెద్ద ఎత్తున లొంగిపోవడం, ప్రభుత్వ పునరావాస పథకాలను అందిపుచ్చుకోవడం మిగతా 2లో

టాప్ న్యూస్



### విజయ్ ఆస్తులు రూ.404 కోట్లు

- ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టత
- 2024..25లో రూ.184.53కోట్ల ఆదాయం

02



### వారు లేకపోతే ఈరోజు

- తెలంగాణలో ముఖ్యమంత్రులు, మంత్రులు ఉండేవారా?
- మండలిలో విజయశాంతి గళం
- సర్కారుపై ప్రశ్నల వర్షం

02



### చెన్నైని చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీ

- సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం

02



## కాళేశ్వరం ప్రాజెక్ట్
# అట్టర్ ఫ్లాప్
## రాజ్యసభలో భగ్గుమన్న కేంద్రమంత్రి సీఆర్ పాటిల్

- రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారంటూ ఫైర్
- బీఆర్ఎస్ ఎంపీ సురేష్ రెడ్డిపై సీరియస్
- కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆగ్రహం
- సీబీఐ విచారణ జరపాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్

**ఢిల్లీ, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ తీరుపై కేంద్రం భగ్గుమంది. అనూహ్యంగా తీవ్రస్థాయిలో రియాక్ట్ అయింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అట్టర్ ఫ్లాఫ్ అని విమర్శించారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరగా, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తీవ్రస్థాయిలో స్పందించారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలన్న బీఆర్ఎస్ ఎంపీని.. ప్రాజెక్ట్ కట్టిన మూడేళ్లలోనే ఎందుకు కుంగిపోయిందని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి సభకు వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్ ధ్వజమెత్తారు. రాష్ట్రం వద్ద రూ.873 కోట్లు ఉన్నా.. మూడేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.194 కోట్లేనని ఆయన గుర్తు చేశారు. మూడేళ్లుగా ఒక్క కొత్త స్కీమ్ ప్రతిపాదన కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి రాలేదని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ పెదవి విరిచారు.

### సీబీఐ విచారణ జరపండి
**- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్**

మరోవైపు తెలంగాణకు చెందిన రాజ్యసభ్య సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ చే విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలను నిగ్గు తేల్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసును సీబీఐకి అప్పగించిందని గుర్తు చేశారు.



### త్వరలో ఒప్పందం కుదరకపోతే సర్వనాశనం చేస్తాం
#### ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

**మహా :** ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. మిగతా 2లో



### తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా

**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. మొత్తం పది రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు కొనసాగాయి. 82 గంటల 47 నిమిషాల పాటు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. అసెంబ్లీ మూడు తీర్మానాలు చేసింది. 10 బిల్లులకు ఆమోదం తెలిపింది. ఒక బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపింది. ద్రవ్య వినిమయ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది.

#### ప్రాణాంతక గడ్డిమందు నిషేదం
### చారిత్రాత్మకం
#### టీపీసీసీ డాక్టర్స్ సెల్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ హర్షం



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ప్రాణాంతక రసాయనంగా మారిన పారాక్వాట్ (గడ్డిమందు)పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా ఆరోగ్య రంగంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఈ గడ్డిమందు తయారీ, విక్రయాలపై పూర్తిస్థాయి నిషేధాన్ని విధించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపే తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల టీపీసీసీ డాక్టర్ సెల్, మెడికల్ & హెల్త్ విభాగం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా, మానవతా దృక్పథంతో ప్రజల ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ అడుగు వేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. మిగతా 2లో

## అనిరుధ్ రెడ్డి సంచలనం

- ఇప్పసారాకు 52మంది ఎమ్మెల్యేల మద్దతు
- 52 మంది ఎమ్మెల్యేల సంతకాలతో ముఖ్యమంత్రికి వినూత్న ప్రతిపాదన
- పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన ఆర్థికాభివృద్ధికి బాటలు



**హైదరాబాద్, మహా:**
తెలంగాణ గడ్డపై ప్రకృతి సిద్ధంగా పెరిగే 'ఇప్ప' (మహువ) చెట్ల పునరుజ్జీవనానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శ్రీకారం చుట్టిన వినూత్న ఉద్యమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పది లక్షల ఇప్ప చెట్లను నాటాలన్న ఆయన ప్రతిపాదనకు అసెంబ్లీ వేదికగా ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతున్నారు. మిగతా 2లో

#### ఏప్రిల్ 4న క్యాతనపల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం
### మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక
వివరాలు 2లో



### దేశానికే తలమానికంగా 'మహా గోశాల'

- రేవంత్ సర్కారు భారీ కార్యాచరణ!
- ఎన్కేపల్లిలో రూ.157 కోట్లతో అత్యాధునిక గోమాత నిలయం
- 54 ఎకరాల్లో గోసంరక్షణ క్షేత్రం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో గోసంరక్షణను సరికొత్త పుంతలు తొక్కించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత ఆధునిక వసతులతో కూడిన భారీ గోశాలను నిర్మించేందుకు సర్కారు సిద్ధమైంది. సుమారు 157 కోట్ల భారీ వ్యయంతో హైదరాబాద్ మిగతా 2లో

## కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు
### రావణుడి వల్లే రాముడికి అంత గొప్ప కీర్తి

- నియోజక వర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి నష్టం
- ఆహార కల్తీపై ఈగల తరహా వ్యవస్థ అవసరం
- సన్న బియ్యం పథకం ఒక విప్లవాత్మక మార్పు
- మీడియా చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో సోమవారం మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్ చాట్‌లో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే తనకు ఈ స్థాయి గుర్తింపు వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రామాయణాన్ని ఉదహరిస్తూ, రావణుడు ఉన్నాడు కాబట్టే రాముడికి అంత గుర్తింపు, విలువ పెరిగిందన్నారు. మిగతా 2లో

### సన్నబియ్యం లంచ్‌లో సీఎం పక్కనే రాజగోపాల్ రెడ్డి
#### ఉత్తమ్ కుమార్ రెడ్డిపై సీఎం ప్రశంసలు
వివరాలు 2లో



# దేశానికే తలమానికంగా మహా గోశాల

(మొదటిపేజీ తరువాయి)

శివారులోని ఎన్కేపల్లి వేదికగా ఈ బృహత్తర ప్రాజెక్టుకు అంకురార్పణ చేయనుంది. కేవలం ఆవులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా, వాటికి రాజభోగాలను తలపించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ గోశాలను తీర్చిదిద్దాలని నిర్ణయించడం గమనార్హం. ఆధ్యాత్మికతకు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ రూపొందించిన ఈ ప్రణాళిక ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.ఈ భారీ గోశాల నిర్మాణం కోసం ప్రభుత్వం 54 ఎకరాల సువిశాల స్థలాన్ని కేటాయించింది. ఇందులో పశువుల సౌకర్యార్థం పది అత్యాధునిక షెడ్లను నిర్మించనున్నారు. ప్రతి షెడ్డులో వంద ఆవులు ఉండేలా అత్యంత విశాలంగా వీటిని రూపొందించారు. కేవలం నివాసమే కాకుండా, గోవుల పరిశుభ్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. సాధారణంగా మనుషులకే పరిమితమైన 'షవర్' సౌకర్యాన్ని ఇక్కడ ఆవుల కోసం కూడా ఏర్పాటు చేస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు, గోవులు స్నానం చేయడానికి ప్రత్యేకంగా షవర్లను అమర్చడం ఈ ప్రాజెక్టులోని విశిష్టత. దీనివల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆధ్యాత్మికతను చాటిచెప్పేలా ఈ ప్రాంగణంలోనే ఒక అద్భుతమైన టెంపుల్ కాంప్లెక్స్‌ను కూడా నిర్మించనున్నారు. భక్తులు గోపూజలు నిర్వహించుకోవడానికి, ఆధ్యాత్మిక ప్రవచనాల కోసం ఈ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గోవుల ఆహార అవసరాల కోసం కూడా ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. 54 ఎకరాల ప్రాంగణంలో డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పద్ధతిని ఉపయోగించి నాణ్యమైన పశుగ్రాసాన్ని పండించనున్నారు. దీనివల్ల తక్కువ నీటితో ఏడాది పొడవునా పశువులకు పౌష్టికాహారం అందుబాటులో ఉంటుంది. గోసంరక్షణ అంటే కేవలం మేత వేయడమే కాకుండా, వాటికి నిరంతర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇక్కడ ఒక సూపర్ స్పెషాలిటీ పశువైద్యశాలను కూడా నెలకొల్పుతున్నారు. గోవులకు నిరంతర పర్యవేక్షణ అందించడం కోసం వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది గోశాల ప్రాంగణంలోనే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా స్టాఫ్ క్వార్టర్లను నిర్మించనున్నారు. తద్వారా పశువులకు ఏ సమయంలో అనారోగ్యం కలిగినా తక్షణమే చికిత్స అందించే వీలుంటుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ రాష్ట్రం గోసంరక్షణలో దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. రేవంత్ సర్కారు తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల గోప్రేమికులు, ఆధ్యాత్మికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కావని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నప్పటికీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమోనని తనకు అనుమానం కలుగుతోందని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

**డీలిమిటేషన్- దక్షిణాది రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు**

కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఒకవేళ లోక్ సభ సీట్లు 50 శాతం పెరిగితే, అదనంగా 410 సీట్లు వస్తాయని, అయితే ఇందులో మెజారిటీ సీట్లు ఉత్తరాది రాష్ట్రాలకే వెళ్తాయని విశ్లేషించారు. దీని వల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యత పూర్తిగా తగ్గిపోతుందని, దక్షిణాది మద్దతు లేకుండానే కేంద్రంలో నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీజేపీ నేతలు లక్షణ్, బండి సంజయ్, కిషన్ రెడ్డి చొరవ తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఆహార కల్తీపై ఈగల్ తరహా పోరాటం**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఆహార కల్తీ మాఫియా రేవంత్ రెడ్డి ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. ఇప్పటికే ఈ అక్రమ కట్టడాలపై హైడ్రా, మాదక ద్రవ్యాలపై ఈగల్ వ్యవస్థలు విధంగా పని చేస్తున్నాయో అదే తరహాలో ఆహార కల్తీని అరికట్టేందుకు ఒక ప్రత్యేక, శక్తివంతమైన వ్యవస్థను తీసుకురానున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న అత్యుత్తమ ఆహార భద్రతా చట్టాలను ప్రభుత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తుంది. ఈ వ్యవస్థకు విస్తృత అధికారులతోపాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించనున్నారు. ఆహార పదార్థాలను కల్తీ చేసే వారిపై హత్యానేరం కంటే కఠినమైన చర్యలు తీసుకునేలా చట్టాలను రూపొందిస్తున్నారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచే వారిని వదిలి పెట్టబోమని, సామాన్యులకు ఇబ్బంది కలిగించే అక్రమ నిల్వదారులు కఠిన శిక్షలకు గురవుతారని సీఎం హెచ్చరించారు.

**రైతు సంక్షేమం- దళారీ వ్యవస్థకు చెక్**

రైతులు తమ పంటకు తామే ధర నిర్ణయించుకునే పరిస్థితి లేకపోవడంపై రేవంత్ రెడ్డి విచారణ వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారుల దోపిడీ చేస్తున్నారని దీనిని అడ్డుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతు హక్కులకు కాపాడడానికి, వారికి సరైన గిట్టుబాటు ధర కల్పించడానికే తమ ప్రభుత్వం ఎంఎస్‌పీ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్‌లో రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పిస్తామని సీఎం తెలిపారు.

**సన్న బియ్యం పథకం ఒక విప్లవాత్మక మార్పు**

గతంలో అమలైన కిలో బియ్యం పథకంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల ప్రజలు వాటిని తినలేక మాఫియా చేతుల్లోకి వెళ్లేవని రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ బ్లాక్ మార్కెట్ మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాకు ఐదు వందల రూపాయల బోనస్ అందిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 86 శాతం మంది ప్రజలకు అంటే విద్యార్థులు పౌష్టికాహారం అందించడం తమ తదుపరి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రేషన్ ద్వారా నాణ్యమైన బియ్యం అందించడమే కాకుండా, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం తమ తదుపరి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### త్వరలో ఒప్పందం కుదరకపోతే
# సర్వనాశనం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. ''ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం'' అని హెచ్చరించారు.

# సన్నబియ్యం లంచ్ లో సీఎం పక్కనే రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రేషన్ దుకాణాల్లో సరఫరా చేసే సన్న బియ్యంతో భోజనం చేశారు. అసెంబ్లీలోని సెంట్రల్ హాలులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 'సన్న బియ్యం లంచ్' ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సెంట్రల్ హాలులో ఈ లంచ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కనే కూర్చుని భోజనం చేశారు. ముఖ్యమంత్రి, కోమటిరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు ఈ లంచ్‌లో పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఆలోచన తనది అయినప్పటికీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనిని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

# ప్రాణాంతక గడ్డిమందు నిషేదం చారిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

పారాక్వాట్ అనేది వ్యవసాయ రంగంలో కలుపు నివారణకు వాడే రసాయనం అయినప్పటికీ, ఇది అత్యంత భయంకరమైన విషపూరిత లక్షణాలను కలిగి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అనుకోకుండా జరిగే ప్రమాదాలు లేదా ఆత్మహత్యాయత్నాల్లో ఈ గడ్డిమందును సేవించిన వారు మృత్యువాత పడటం నిత్యకృత్యంగా మారింది. ఈ విషం శరీరంలోకి వెళ్ళిన తర్వాత ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు ఇతర కీలక అవయవాలను అత్యంత వేగంగా దెబ్బతీస్తుంది. అన్నిటికంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, పారాక్వాట్ విషానికి ఇప్పటికీ వైద్య శాస్త్రంలో ఎటువంటి నిర్దిష్టమైన 'యాంటిడోట్' (విరుగుడు) అందుబాటులో లేదు. దీనివల్ల ఆసుపత్రికి చేరిన రోగులను కాపాడటం వైద్యులకు సైతం సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో, ఆ రసాయనం లభ్యతను అరికట్టడమే సరైన మార్గమని భావించి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు.ఈ నిషేధ తీర్మానం కేవలం ఆరోగ్య పరమైన చర్య మాత్రమే కాదని, ఇది ఒక సామాజిక సంస్కరణ వంటిదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ యువత, రైతాంగం క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల ప్రాణాలు కోల్పోకుండా ఈ చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుంది. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించిందని, పారాక్వాట్ లాంటి ప్రమాదకరమైన రసాయనాలను నియంత్రించడం వల్ల రాష్ట్రంలో మరణాల రేటు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాణాలను విలువైనవిగా భావించే ప్రభుత్వం ఉన్నప్పుడే ఇటువంటి విప్లవాత్మకమైన నిర్ణయాలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రతను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని, ఈ కఠిన నిర్ణయాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మరియు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులకు డాక్టర్ రాజీవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా క్షేమాన్ని కాంక్షించే ఇటువంటి నిర్ణయాలు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తాయని, ఈ తీర్మానం త్వరలోనే కేంద్రం వద్ద ఆమోదం పొంది అమలులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.



### వారు లేకపోతే ఈరోజు తెలంగాణలో
# ముఖ్యమంత్రులు, మంత్రులు ఉండేవారా?
### మండలిలో విజయశాంతి గళం
### సర్కారుపై ప్రశ్నల వర్షం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రం కోసం తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే, ఈరోజు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ ఉండేవారా అని శాసనమండలి ఎమ్మెల్సీ విజయశాంతి ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన వారి తరపున విజయశాంతి మండలిలో తన గళం వినిపించారు. పదవుల కంటే ముందు ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు వివిధ సందర్భాలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఉద్యమకారుల విషయంలో ఈ ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తే, కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలుస్తుందని అన్నారు. లేదంటే చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# విజయ్ ఆస్తులు రూ.404 కోట్లు

**చెన్నై,మహా:** ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన ఆస్తుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం, ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ. 404.58 కోట్లుగా (రూ. 4,04,58,57,196) ఉంది. బ్యాంకు డిపాజిట్లు, వివిధ పెట్టుబడులు, ఖరీదైన వాహనాలతో పాటు ఇతర చరాస్తుల వివరాలను ఆయన ఈ అఫిడవిట్‌లో కూలంకషంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ. 2 లక్షలు ఉండగా, భార్య సంగీత వద్ద రూ. 1 లక్ష ఉన్నట్లు విజయ్ పేర్కొన్నారు. తన సంపదలో సింహభాగం బ్యాంకు డిపాజిట్ల రూపంలోనే ఉంది. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్ మరియు ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో సుమారు రూ. 388 కోట్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వాహనాల విషయానికొస్తే, విజయ్ వద్ద అత్యంత విలాసవంతమైన కార్ల సేకరణ ఉంది. బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, వీటి మొత్తం విలువ రూ. 14.35 కోట్లు ఉంటుందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బంగారం, వెండి ఆభరణాల వివరాలను కూడా విజయ్ సమర్పించారు. తన వద్ద 883 గ్రాముల బంగారం ఉందని, దాని విలువ సుమారు రూ. 1.20 కోట్లు ఉంటుందని తెలిపారు. అలాగే రూ. 15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్తుల విషయానికి వస్తే, తాను స్వయంగా కొనుగోలు చేసిన ఆస్తులతో పాటు వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. తన ప్రధాన ఆదాయ వనరులుగా స్వయం ఉపాధి, వడ్డీలు, ఆస్తుల నుంచి వచ్చే అద్దెను ఆయన చూపించారు. ముఖ్యంగా 202425 ఆర్థిక సంవత్సరంలో విజయ్ ఏకంగా రూ. 184.53 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు అఫిడవిట్ ద్వారా స్పష్టమైంది.

# తెలంగాణ బీజేపీ జంబో కార్యవర్గం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు సోమవారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్ నుంచి వెలువడిన ఈ ప్రకటనలో శాశ్వత ఆహ్వానితులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మరియు ప్రత్యేక ఆహ్వానితుల పేర్లను వెల్లడించారు. రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతమే లక్ష్యంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని రూపొందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శాశ్వత ఆహ్వానితుల విభాగంలో హేమాహేమీలకు చోటు కల్పించారు. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, డి.కె. అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, ఎం. రఘునందన్ రావు, గోడం నగేశ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలను ఈ జాబితాలో నియమించారు. వీరితో పాటు శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకట రమణారెడ్డి, రామారావు పటేల్, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త, పైడి రాకేశ్ రెడ్డిలకు ప్రాధాన్యత కల్పించారు. ఎమ్మెల్సీలు ఎ. వెంకట నారాయణ రెడ్డి, మల్కా కోమరయ్య, సి. అంజిరెడ్డిలతో పాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కూడా శాశ్వత ఆహ్వానితులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 116 మందికి అవకాశం కల్పించారు. ఇందులో మంచిర్యాల జిల్లా నుంచి దుర్గం అశోక్, అమరాజుల శ్రీదేవి, నిర్మల్ నుంచి సత్యనారాయణ గౌడ్, కునింటి అంజూ కుమార్ రెడ్డి, రవి పాండే, లక్ష్మీపూర్ నారాయణ రెడ్డిలు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి భరత్ రెడ్డి, డాక్టర్ అలేటి మల్లికార్జున్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, గద్దె శ్రీనివాస్, మేడపాటి ప్రకాశ్ రెడ్డిలకు చోటు లభించింది. కామారెడ్డి నుంచి పైడి ఎల్లారెడ్డి, గార్గే శ్రీనివాస్, డాక్టర్ మర్రి రాంరెడ్డి, జగిత్యాల నుంచి పుదారి అరుణ, డాక్టర్ యాచమనేని అనూప్ రావు, చన్నమనేని సత్యారావు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా నుంచి చంద్రుపట్ల సునీల్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్, బల్మూరి వనిత, మనోహర్ రెడ్డిలకు కార్యవర్గంలో స్థానం కల్పించారు. సంగారెడ్డి నుంచి ఎం. నరేందర్ రెడ్డి, రాజేశ్వర రావు దేశ్ పాండే, సిద్దిపేట నుంచి కనకయ్య, చింత సంతోష్ కుమార్, ఎస్. విద్యాసాగర్, అంబటి బాలేష్ గౌడ్ లు నియమితులయ్యారు.

# అనిరుధ్ రెడ్డి సంచలనం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పించనున్న ఈ బృహత్తర వినతి పత్రంపై ఇప్పటికే 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంతకాలు చేయడం రాజకీయ మరియు పర్యావరణ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మన సంస్కృతిలో అంతర్భాగమైన ఇప్ప చెట్టును కేవలం అటవీ సంపదగానే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చే శక్తిగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరిస్తూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాసిన లేఖలో పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక ప్రయోజనాలను ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణలోని సెమీఆరిడ్ వాతావరణానికి ఇప్ప చెట్లు ఎంతో అనువైనవని, ఇవి కరువును తట్టుకోవడమే కాకుండా భూసారాన్ని పెంచి భూగర్భ జలాల వృద్ధికి దోహదపడతాయని వివరించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఈ చెట్ల ద్వారా లభించే పువ్వులు, గింజలు వారి జీవనోపాధికి ప్రధాన వనరుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇప్ప పువ్వులతో తయారు చేసే వివిధ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, దీని ద్వారా గ్రామీణ మహిళలు మరియు స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, కమ్యూనిటీ భూముల్లో ఈ తోటల పెంపకాన్ని చేపట్టాలని, ప్రస్తుత హరితహారం వంటి పథకాలతో దీనిని అనుసంధానం చేయాలని ఆయన ప్రతిపాదించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం మరియు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా తెలంగాణను పర్యావరణ పరంగా ఒక రోల్ మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దవచ్చని లేఖలో పేర్కొన్నారు. కేవలం పర్యావరణానికే కాకుండా వన్యప్రాణులకు ఆహార వనరుగా కూడా ఈ చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. పార్టీలకు అతీతంగా 52 మంది ప్రజాప్రతినిధులు ఈ సంతకాల సేకరణలో పాల్గొనడం చూస్తుంటే, పర్యావరణ హితమైన ఈ ప్రాజెక్టు పట్ల అందరిలో ఉన్న ఆసక్తి స్పష్టమవుతోంది. త్వరలోనే ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రవ్యాప్తంగా ఇప్ప వనాల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టేందుకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సన్నద్ధమవుతున్నారు.

# ఏప్రిల్ 4న క్యాతనపల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక

**హైదరాబాద్, మహా :** క్యాతనపల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని సోమవారం ఆయా జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశించింది. 2026, ఏప్రిల్ 4న మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2026, ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగ్గా, 90శాతం మునిసిపాలిటీలు కాంగ్రెస్ గెలిచింది. .. క్యాతనపల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మూడు మున్సిపాలిటీల్లో వివిధ కారణాలతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడగా, ఇపుడు నిర్వహణకు మార్గం సుగమమైంది.

# నక్సల్స్ రహిత భారత్



(మొదటిపేజీ తరువాయి)

ఒక సానుకూల పరిణామమని ఆయన కొనియాడారు. హింస ద్వారా సాధించేదేమీ లేదని, ప్రజాస్వామ్య ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతి ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. బస్తర్ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో సైతం ఇప్పుడు పాఠశాలలు ఏర్పాటు చేశామని, విద్యుత్, రోడ్లు మరియు మౌలిక వసతులు గిరిజనుల గడప వద్దకు చేరుకున్నాయని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని, తద్వారా భావి తరాలు తుపాకీ పట్టకుండా పుస్తకాలు పట్టేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గత పాలకుల వైఫల్యాలపై అమిత్ షా ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ, ఆదివాసీల కనీస అవసరాలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా చూశారే తప్ప, వారి జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేయలేదని ధ్వజమెత్తారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిజన ప్రాంతాల రూపురేఖలు మారాయని, గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు పెంచడమే కాకుండా, వారి ఆత్మగౌరవాన్ని పెంచేలా ద్రౌపది ముర్ము గారిని రాష్ట్రపతిని చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు.

అడవి బిడ్డల సంక్షేమం కోసం కేంద్రం అమలు చేస్తున్న ఏకలవ్య పాఠశాలలు, గిరిజన విశ్వవిద్యాలయాలు వారి విద్యా ప్రమాణాలను పెంచుతున్నాయని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లు అడ్డుపడుతున్నా సరే, ధైర్యంగా మౌలిక వసతుల కల్పనను కొనసాగిస్తున్నామని, భద్రతా దళాల నిరంతర పర్యవేక్షణలో మారుమూల ప్రాంతాల్లో సైతం పోస్ట్ ఆఫీసులు, బ్యాంకులు మరియు ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు. చివరగా, రక్తం చిందించడం మాని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నక్సల్స్ నేతలకు సూచిస్తూ.. నక్సలిజం లేని భారత్‌ను త్వరలోనే చూస్తామని హోంమంత్రి ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, భద్రత అనే రెండు చక్రాలతో గిరిజన ప్రాంతాల ప్రగతి రథం ముందుకు సాగుతుందని సభ సాక్షిగా హామీ ఇచ్చారు.

# చెన్నైని చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీ
## సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం

**గౌహతి,మహా.** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం గౌహతిలోని బర్సపారా స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని చెన్నై జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. పదిహేనేళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ సృష్టించిన పరుగుల విధ్వంసానికి తోడు, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో చెన్నై పేలవ ప్రదర్శన ఆ జట్టు కొంపముంచింది.



**పేకమేడలా కూలిన చెన్నై ఇన్నింగ్స్**

మ్యాచ్ ప్రారంభానికి ముందే పిచ్ స్వభావాన్ని పసిగట్టిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్.. టాస్ గెలిచి ఏమాత్రం సంకోచించకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. తన బౌలర్లపై అతను పెట్టుకున్న నమ్మకాన్ని వారు నూరు శాతం వమ్ము చేయలేదు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే రాజస్థాన్ పేసర్లు జోఫ్రా ఆర్చర్ (2/19), నాంద్రే బర్గర్ (2/26) నిప్పులు చెరిగే బంతులతో చెన్నై సూపర్ కింగ్స్ టాపార్డర్‌ను కకావికలం చేశారు. వారి వేగానికి తోడు స్పిన్నర్ల మాయాజాలం జతకలవడంతో చెన్నై బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా శ్రమించారు. ముఖ్యంగా పదిహేడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన పాత ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరిన స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, తన మాజీ జట్టు చెన్నైపైనే అద్భుతమైన స్పెల్ వేసి రెండు కీలక వికెట్లు పడగొట్టడం విశేషం. రాజస్థాన్ బౌలర్ల ఉక్కిరిబిక్కిరి చేసే దాడుల ముందు ఒకానొక దశలో చెన్నై కేవలం పది ఓవర్లలోనే 70 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి, ఆ తర్వాత 82 పరుగుల వద్ద ఎనిమిదో వికెట్ (నూర్ అహ్మద్ 1) చేజార్చుకుని పీకల్లోతు కష్టాల్లో పడింది. అరంగేట్ర ఆటగాడు కార్తీక్ శర్మ (18), సర్ఫరాజ్ ఖాన్ (17) నామమాత్రపు స్కోర్లకే పరిమితమయ్యారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జేమీ ఓవర్టన్ (43 పరుగులు) చూపించిన పోరాట పటిమ అమోఘం. అతడు టెయిలెండర్లతో కలిసి విలువైన పరుగులు జోడించి ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై సూపర్ కింగ్స్ 19.4 ఓవర్లలో 127 పరుగుల గౌరవప్రదమైన స్కోరునైనా సాధించగలిగింది.

**పదిహేనేళ్ల కుర్రాడి ప్రళయం.. రికార్డుల మోత**

128 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ చూస్తే మైదానంలో తుఫాను వచ్చినట్లు అనిపించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన పదిహేనేళ్ల యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కళ్ళు చెదిరే షాట్లతో చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అన్షుల్ కాంబోజ్ వేసిన ఐదో ఓవర్‌లో రెండు ఫోర్లు, ఒక భారీ సిక్సర్ బాదిన వైభవ్, జట్టు స్కోరును ఐదు ఓవర్లకే 55 పరుగులకు చేర్చాడు. ఆ తర్వాత నూర్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాది కేవలం 15 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. పవర్ ప్లేలోనే ఏకంగా ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లు కొట్టి, 305 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసం సృష్టించాడు. యశస్వి జైస్వాల్‌తో కలిసి కేవలం 30 బంతుల్లోనే 75 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను పూర్తిగా రాజస్థాన్ వైపు తిప్పేశాడు. ఐపీఎల్ చరిత్రలో రాజస్థాన్ తరపున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీల జాబితాలో (యశస్వి జైస్వాల్ 13 బంతుల తర్వాత) వైభవ్ ఇన్నింగ్స్ రెండవ స్థానంలో నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. 17 బంతుల్లో 52 పరుగులు చేసిన అనంతరం అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లో సర్ఫరాజ్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి వైభవ్ పెవిలియన్ చేరాడు.

## చేతులెత్తేసిన బౌలర్లు.. నిరాశపరిచిన ఫీల్డర్లు

వైభవ్ సూర్యవంశీ అందించిన రాకెట్ లాంటి ఆరంభాన్ని మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్లాడు. వైభవ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కాసేపు బ్యాట్ ఝుళిపించి అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లోనే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్ ఎలాంటి తడబాటు లేకుండా మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ బౌలర్లను ఎంత మార్చినా ఫలితం శూన్యం. ఒక్క అన్షుల్ కాంబోజ్ మాత్రమే రెండు వికెట్లు తీసి కాస్తంత ప్రభావం చూపగా, మిగతా బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. దీనికి తోడు ఫీల్డర్లు పలు కీలకమైన క్యాచ్‌లను వదిలేయడం కూడా చెన్నై పరాజయపు అంతరాన్ని పెంచింది. ఎట్టకేలకు రాజస్థాన్ రాయల్స్ కేవలం 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అత్యంత సునాయాసంగా ఛేదించి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ఎనిమిది వికెట్ల తేడాతో సాధించిన ఈ భారీ విజయం రాజస్థాన్ జట్టు నెట్ రన్ రేట్‌ను అమాంతం పెంచడమే కాకుండా, టోర్నీలో మిగతా జట్లకు ఒక బలమైన హెచ్చరికను పంపింది. మరోవైపు ఐదు సార్లు కప్పు గెలిచిన అపార అనుభవం ఉన్న చెన్నై సూపర్ కింగ్స్, ఏ ఒక్క విభాగంలోనూ కనీస పోరాటం చేయలేక పోవడంపై తీవ్రంగా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ మ్యాచ్ గుర్తుచేసింది.



### తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**బెల్లంపల్లి, మహా :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు కూలీలకు ఆటో డ్రైవర్లకు బాటసారులకు చిరు వ్యాపారస్తులకు 4వరోజు దాత కీర్తిశేషులు హరికిషన్ సోనీ కుటుంబసభ్యుల సహకారంతో అంబలి పంపిణీ చేశారు. దాతల సహకారంతో ప్రతిరోజు అంబలి పంపిణీ ఉంటుందని 400 మందికి పైగా ఉచితంగా అంబలి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాల్లో నాయకులు గెల్లీ జయరాం యాదవ్,నాగుల లింగయ్య,గురుస్వామి గరిగె రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.



### వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోదాంలో హమాలీల సమస్యలపై సమావేశం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లిపట్టణం లోని వ్యవసాయ మార్కెట్ పిడిఎస్ గోదాంలోహమాలీల సమస్యలపై విస్తృత స్థాయి సమావేశంను సోమవారం నాడు నిర్వహించారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ అధికారులు,గోదాంసిబ్బంది,హమాలీ సంఘం ప్రతినిధులు,కార్మికులు పాల్గొన్నారు. సమావేశంలో హమాలీలకు సంబంధించిన ముఖ్య సమస్యలు అయిన కూలి రేట్ల పెంపు,పనిగంటల వ్యవస్థ, బరువుల మోసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, భద్రతా ఏర్పాట్లు,తాగునీరు, విశ్రాంతి సౌకర్యాల లేమి వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.హమాలీలు తమసమస్యలను స్పష్టంగా వెల్లడించగా, అధికారులు వాటిపై స్పందిస్తూ సమస్యలను పరిష్కరించారు.ప్రత్యేకంగా కూలి రేట్ల విషయంలో ఉన్న అసమానతలను సరిచేసి, న్యాయమైన రేట్లు అమలు చేయాలని నిర్ణయించారు. హమాలీకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పని పరిస్థితులను మెరుగుపరచడం, భద్రతా ప్రమాణాలను పాటించడం వంటి విషయాల్లో కూడా స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు, సిబ్బందిలు సమ్మయ్య,నాగరాజు, శంకర్,రాజ్ కుమార్ తో పాటు హమాలీ సంఘం నాయకులు, మిగతా కార్మికులు పాల్గొన్నారు.



### ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సేవలు

#### మున్సిపల్ చైర్ పర్సన్

ఆదిలాబాద్ మహా : ప్రయివేట్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడం జరుగుతుందని ప్రజలు ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రత్యేక ప్రణాళికల 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శాంతినగర్ లోని పుత్లీబౌలి అర్బన్ హెల్త్ సెంటర్లో స్పెషలిస్ట్ హెల్త్ క్యాంపు ను ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు చైర్పర్సన్ను కలిసి వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తన వంతుగా ఆశాలకు సహకారం అందిస్తానని చైర్పర్సన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్మాట్లాడుతూ.ప్రభుత్వం ప్రజాల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 99రోజుల ప్రత్యేక ప్రణాళికలతో స్పెషలిస్ట్ వైద్యులతో శిబిరాలను నిర్వహించి వారికి వైద్య సేవలను అందిస్తుందన్నారు. పుత్లీబౌలి అర్బన్ హెల్త్ సెంటర్ ప్రయివేట్కు ధీటుగాఉందని, ఇక్కడ పరిశుభ్రత, వైద్యుల తీరు బాగుందని కొనియాడారు. డబ్బులున్న వారుప్రయివేట్ వైద్యం చేసుకుంటారని.. అదే కూలీ పనులు చేసుకునే వారికి ప్రభుత్వ ఆస్పత్రులే దిక్కని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయివేట్లో లభించే అన్ని రకాల టెస్టులు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ ఓ డాక్టర్ సాధన, స్థానిక కౌన్సిలర్ నజీర్,శ్రీకాంత్ స్పెషలిస్ట్ వైద్యులు సందీప్ కుమార్, దీపక్, ఆస్పత్రి నర్సింగ్ ఆఫీసర్ చంద్రకళ, సీఓ నవీన్ కుమార్, నాయకులు బండారి సతీష్, ,మనోజ్ ,తౌఫిక్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు ఓబీ కంపెనీ దుర్గలో దుర్ఘటనకు పరిహారం..

### మృతుని కుటుంబానికి రూ.57 లక్షలు.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని విపిఆర్ అనుబంధ దుర్గా ఇన్‌ఫ్రా ఓబీ కంపెనీలో ఆదివారం జరిగిన ఘోర ప్రమాదానికి సంబంధించి కార్మిక సంఘాలు, యాజమాన్యం మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఎందుకు సంబంధించి కార్మిక నేతలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు ఏరియాలో ఆదివారం సాయంత్రం ఓసీ2లో స్కానియా డంపర్ టైరు పేలిన ఘటనలో బీహార్‌కు చెందిన కార్మికుడు మొహమ్మద్ సర్ఫేజ్ (40) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగిన చర్చల అనంతరం సింగరేణి అధికారుల మధ్యవర్తిత్వంలో వ్రాతపూర్వక ఒప్పందానికి చేరుకున్నారు. ఒప్పందం ప్రకారం మృతుని కుటుంబానికి వర్క్‌మెన్ కాంపెన్సేషన్, ఎక్స్‌గ్రేషియా కలిపి మొత్తం రూ.57 లక్షలు చెల్లించనున్నారు. ఇందులో రూ.43 లక్షలను నెల రోజుల్లోగా కార్మిక సంఘాల సమక్షంలో నేరుగా కుటుంబ సభ్యులకు అందజేయాలి. మిగిలిన సుమారు రూ.14 లక్షల వర్క్‌మెన్ కాంపెన్సేషన్‌ను కార్మిక శాఖ ఆధ్వర్యంలో చట్టపరంగా చెల్లించే ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించారు. అలాగే మృతదేహాన్ని స్వగ్రామమైన బీహార్ రాష్ట్రంలోని వైశాలి



జిల్లా మజియా గ్రామానికి తరలించడం, అంత్యక్రియల ఖర్చులను కంపెనీ భరించడం, మణుగూరులో కాంట్రాక్ట్ కొనసాగినంతకాలం కుటుంబానికి జీతం చెల్లించడం వంటి అంశాలు కూడా ఒప్పందంలో చేర్చారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించి వారు పూర్తిగా కోలుకునేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనని స్పష్టం చేశారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు సింగరేణి, ఓబీ కంపెనీ యాజమాన్యాలను డిమాండ్ చేశాయి. తరచుగా రక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కూడా సూచించాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు వై రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ నాయకుడు వత్సవాయి కృష్ణంరాజు, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎస్.డి నాసర్ పాషాలు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలనే మానవతా దృక్పథంతో అఖిలపక్షాల ఆధ్వర్యంలో కృషి చేశామని తెలిపారు. చర్చలను సానుకూలంగా నడిపిన ఏరియా జీఎం దుర్గం రామచందర్, డీజీఎం (పర్సనల్) రమేష్, పీకే ఓసీ ప్రాజెక్టు అధికారి రమేష్, వైద్యులు, దుర్గా ఓబీ కంపెనీ మేనేజర్ లు బిపిన్, సునీల్ తదితరులకు కార్మిక నేతలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మణుగూరు సీఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, వందపడకల ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, పర్సనల్ విభాగం అధికారులు ఎస్. శ్రీనివాస్, రామేశ్వర్, వంశీ, కిరణ్, బీజేపీ నాయకుడు జంపన సీతారామరాజు, కార్మిక సంఘాల నాయకులు మేకల ఈశ్వర్, శనిగరపు కుమారస్వామి, సురేందర్, సిలువేరు గట్టయ్య, షేక్ అబ్దుల్ రవూఫ్, అంగోత్ మంగీలాల్, ఓబీ వర్కర్స్ యూనియన్ నాయకులు మధుబాబు, హరి, రవి తదితరులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ ఇప్పించాలి

### జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం జేఏసీ కన్వీనర్ మని రామ్ సింగ్



**బెల్లంపల్లి, మహా:** సింగరేణి సంస్థలో రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన గ్రాడ్యుటి నగదును వెంటనే చెల్లించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ కు రిటైర్డ్ కార్మిక సంఘం జేపీసీ కన్వీనర్ మణిరాంసింగ్ ఆధ్వర్యంలో పలువురునాయకులు వినతిపత్రాన్ని సోమవారంనాడు జిల్లాకలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూసింగరేణి రిటైర్డ్ కార్మికుల గ్రాడ్యూటీ పై సీలింగ్ ఎత్తివేసి 20 లక్షలకు పెంచిన తర్వాత రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన పనిచేసిన కాలానికి రావలసిన సర్వీస్ గ్రాడ్యుటి చెల్లించవలసి ఉండగా సింగరేణి యజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ గ్రాడ్యూటీ చట్టాన్ని కూడా పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని కార్మికుల్ని మనోవేదనకు,ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదనవ్యక్తం చేశారు. సంబంధితసమస్యపై రామగుండం ఏఎల్సి ,ఆర్ఎంసి ఉన్నతాధికారులకు సింగరేణి అనుసరిస్తున్న వైఖరిపైఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. సింగరేణి నుండి రికవరీలు చేపట్టాలని కలెక్టర్ దీపక్ కుమార్ గారికి కూడా కేంద్ర కార్మిక శాఖ ప్రాంతీయ అధికారి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా సింగరేణి రిటైర్డ్ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నది సింగరేణి రిటైర్డ్ కార్మికుల పట్ల అనౌసరిస్తున్న ద్వంద వైఖరికి నిరసనగా సత్వరమే చర్యలు తీసుకోవాలని తమ రిటైర్డ్ కార్మికులందరికీ రావలసిన గ్రాడ్యుకి బకాయిలు త్వరితంగా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కి బెల్లంపల్లి, మందమర్రి ,శ్రీరాంపూర్ ఏరియాలకు చెందిన రిటైర్డ్ కార్మికులు కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వగా గ్రాడ్యుటి విషయంనకు సంబంధించిన విషయాన్ని అర్థం చేసుకోకుండా సింగరేణియాజమాన్యం చెప్పినదానికే వత్తాసుపలుకుతూ ముందు మీరు సింగరేణి వాటర్ ఖాళీ చేయండని మీ గ్రాజుటీ డబ్బులు మీకు ఇప్పిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం ఏల్సి కూడా ఇచ్చిన తీర్పును కూడా సింగరేణి యజమాన్యం నడవదని చెప్పడంతో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చారని కలెక్టర్ తో చెప్పడం జరిగిందని,ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సింగరేణి యజమాన్యంతో మాట్లాడి తగు చర్యలకై సిఫారసు చేసి రిటైర్డ్ కార్మికులకు రావలసిన గ్రాడ్యూటీ బకాయాలను సింగరేణి యజమాన్యం తో ఇప్పించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. లేనియెడల న్యాయం జరిగేంత వరకు కలెక్టర్ కార్యాలయం ముందు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సార మురళీధర్, ఎండి అనీఫ్,నామని వెంకటస్వామి, గుడి రాజయ్య,ఎం.శంకరయ్య,మాయ మల్లయ్య, కూరపాటి గురవయ్య, గూగుల్ల సరియా, పిట్టల నరసయ్య, గాజుల రామకృష్ణ, కనుగంటి కుమారస్వామి, ఓదేలు ,బొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కిష్టారం సర్పంచ్ రాజేశ్వరి

**సత్తుపల్లి, మహా.** ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా నీటి సదుపాయం కల్పించడంపై కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు ప్రత్యేక దృష్టి పెట్టారు. శిథిలావస్థకు చేరిన మోటర్ పైపుల మరమ్మత్తు, పంచాయతీ వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం వంటి వాటిపై శ్రద్ధ పెట్టారు. గ్రామంలోని పలు కాలనీలలో మురికి నీరు నిలిచిపోయి దోమల బెడద ఎక్కువ అవడంతో ఏళ్ల తరబడి పూడికకు నోచుకోని డ్రైనేజీలను పునరుద్ధీకరిస్తూ గ్రామంలోని పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గ్రామ ప్రజల జీవనానికి ఎటువంటి అసౌకర్యం ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ రాజేశ్వరి అప్పారావు తెలిపారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ శీలం నాగరాణి, పంచాయతీ ఎలక్ట్రిషన్ రహీం గ్రామస్తులు పాల్గొన్నారు.



## బూర్గంపాడు గ్రామంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల కేంద్రంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగిస్తున్నామని సర్పంచ్ మంద నాగరాజు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అస్వచ్ఛత ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రోజు నుంచి ఇప్పటివరకు అవి నిరవధికంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలో శుభ్రత పనులు చేపట్టి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్ సెంటర్ పరిధిలోని డ్రైనేజీల్లో గత మూడు సంవత్సరాలుగా పేరుకుపోయిన మట్టిని తొలగించే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. డ్రైనేజీల శుభ్రపరిచే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది చురుకుగా పాల్గొని



పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం భవన ఛాంబర్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 6 చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ఉన్నాయని, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని కోరారు. అలాగే అనాథ పిల్లలను గుర్తించి వారిని వసతి గృహాలలో చేర్పించాలని సూచించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించి వారికి తగిన పారితోషకం ఇప్పించాలని పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పాఠశాలలలో చేర్పించాలని, ఇటుక బట్టీల దగ్గర ఉండే పిల్లలకు పని దగ్గర ప్రదేశాలలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అనాథ పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయా వసతి గృహాలలో చేర్పించాలని కోరారు. చైల్డ్ హెల్ప్ లైన్ కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి , అదనపు గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

### మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా:** అదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ & ఈకో క్లబ్ ఆధ్వర్యంలో ఆహార ఉత్సవ కార్యక్రమాన్నినిర్వహించారు. దీనికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగంతో కలిసి ఆహార ఉత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులు రాగి జావా పండ్లను వివిధ ఆకారాలలో చేపట్టిన ప్రదర్శనను తిలకించారు. అనంతరం చైర్పర్సన్ ను కళాశాల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. విద్యార్థుల వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ డిగ్రీ చదివే విద్యార్థినిలు తమ ఆరోగ్య



పరిరక్షణకు నిత్యం పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. చదువుల్లో రాణిస్తూ జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, కోటయ్య, స్వప్న, నరేష్, కునాల్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలి

### మందమర్రి జిఎం కార్యాలయం ముందర టీబీజీకేఎస్ ధర్నా



**మందమర్రి, మహా :** నెలకు రెండు సార్లు సింగరేణి కాలరీస్ కంపెనీలో నిదుర నిర్వహిస్తున్న బొగ్గు గని కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు బడికల సంపత్ కుమార్, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ లు డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి జిఎం కార్యాలయం ముందర భారత రాష్ట్ర సమితి అనుబంధం టీబీజీకేఎస్ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ ప్రతినెలకు రెండు సార్లు మెడికల్ బోర్డులను నిర్వహించాలని వారు వెల్లడించారు. మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికుడి వారసులకు సింగరేణి నియమ నిబంధనల మేరకు అర్హత కలిగిన ఉద్యోగ నియమకాలు ఇవ్వాలని వారి పేర్కొన్నారు. గత జూలై, నవంబర్ మాసంలో నిర్వహించిన మెడికల్ బోర్డులో నిర్వహించిన మెడికల్ బోర్డులో అర్హత కలిగిన కార్మికులను అన్ ఫిట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా పేరుకుపోయిన విజిలెన్స్, మారుపేర్లు సమస్యను పరిష్కరించాలని కోరారు. మెడికల్ బోర్డు రద్దు కొరకు సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికుల సంఖ్య దాదాపు 2 వేలకు పైగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్మికులకు తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి వారి కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి చెల్లించవలసిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సిహెచ్ వెంకట్ రమణ, దాసరి శ్రీనివాస్, బెల్లం అశోక్, పంజాల ఈశ్వర్, ఈద పోషం, తోట రాజిరెడ్డి, నల్వాల సమ్మయ్య, తిరుపతి, శివ నాయక్, రవి యాదవ్, బనోత్ తిరుపతి , జితేందర్ రెడ్డి వీర రెడ్డి, బైరి శంకర్, కృష్ణ, హనుమంతురావు, కరుకూరి తిరుపతి, పాని ప్రతాప్, వై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక జీఎం రాధాకృష్ణకు అందజేశారు.

## ఏప్రిల్ 4 నాడు మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ

**మందమర్రి, మహా :** క్యాతనపల్లి మునిసిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే ఈ ఎన్నికలలో భారత రాష్ట్ర సమితి, భారత కమ్యూనిస్టు పార్టీ సంయుక్తంగా పోటీకి నిలబడి 14 స్థానాలను దక్కించుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 7 స్థానాలు కైవసం చేసుకోగ, ఒకరు ఇండిపెండెంట్ గా గెలుపొందారు. ఈ నేపథ్యంలో చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ వాహనంపై కొంతమంది దుండగులు రాళ్లు రువ్వారు. దీనితో పోలీసులు లాటించార్జి చేసి ఆందోళన కారులను చదరగొట్టారు. ఈ నేపథ్యంలో ఒక కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయం కాగా ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో కొంతమంది కాంగ్రెస్ నేతలకు గాయాలయ్యాయి. ఆ తర్వాత మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లను ఎన్నిక చేసుకోవలసి ఉండగా జరిగిన రసభస కారణంగా అధికారులు ఎట్టకేలకు ఎన్నికను వాయిదా వేశారు. ఆ తర్వాత తమకు 14 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్, సీపీఐ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదులు చేశారు. కాగా ఎన్నికల కమిషన్ మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్ కు ఏప్రిల్ 4 నాడు ఎన్నికకు అవాంతరాలు ఏర్పడితే ఆ మరుసటి రోజు ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులలో పేర్కొంది. మరి అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ లు ఎలాంటి వ్యూహ, ప్రతి వ్యూహాలు రచిస్తాయో వేచి చూడాల్సిందే.

## మందమర్రిలో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలి

**మందమర్రి, మహా :** మందమర్రి మండలం వివిధ గ్రామాలలో నెలకొన్న విద్యుత్తు సమస్యలను తీర్చాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, మందమర్రి మండల అధ్యక్షులు ఎస్.కె రహీం బాబాలు కోరారు. సోమవారం మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి బీ.ఎస్.పి నేతలు స్థానిక ఎంపీడీవో రాజేశ్వర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్తు లైన్ ట్రాన్స్ ఫార్మర్స్ ద్వారా ప్రజలకు పెను ప్రమాదం ముంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమధ్య విద్యుత్ శాఖకు గురై రెండు గేదలు మృతి చెందాయని గుర్తు చేశారు. తక్షణమే ట్రాన్స్ఫార్మర్ల వద్ద కంచెలు నిర్వహించాలని కోరారు.



అలాగే మందమర్రి మార్కెట్ లో విద్యుత్తు లైన్ లు నివాస భవనాలకు తాకే విధంగా ఉన్నాయని వెల్లడించారు. ఇలా ఉండడం ద్వారా వ్యాపారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని వారు స్పష్టం చేశారు. తక్షణమే ఆయా శాఖాధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. నేటి సంబంధిత ఫిర్యాదును విద్యుత్ శాఖ ఇంజనీర్ కు జిల్లా కలెక్టర్ లకు పంపిస్తామని వెల్లడించారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ప్రజావాణి ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి ప్రజావాణి అర్జీదారులను స్వీకరించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, దాసరి రమేష్ లు తమ తాతల నుండి వస్తున్న పట్టా భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, ఈ పొరపాటును సవరించి తనకు పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. కిష్టంపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో నిజామాబాద్ నుండి జగదల్ పూర్ జాతీయ రహదారి 63 లోని కిష్టంపేట, భీమారం మధ్యలో ఉన్న జోదు వాగులపై నూతన వంతెన నిర్మించాలని కోరారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన



శ్రీనివాస్ తనకు గిఫ్ట్ దస్తావేజు, న్యాయస్థానం డిక్రీ ద్వారా సంక్రమించిన భూమి పట్టాను కొందరు అక్రమంగా రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం అశోక్ రోడ్డు కు చెందిన పాలకుర్తి రమాదేవి తన భర్త పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వేమనపల్లి మండలం నాగారం గ్రామ మాజీ సర్పంచ్ తలండి స్వరూపారాణి తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన భీమనపల్లి రామచంద్రం తనకు చెన్నూర్ మండలం బాబురావుపేట గ్రామ శివారులో గల భూమి ఆన్ లైన్ భూభారతి నందు అసైన్డ్ భూమిగా చూపుతోందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ క్లైమాక్స్

## దశాబ్దాల నెత్తుటి నేలపై శాంతి కపోతాలు

దశాబ్దాల తరబడి దండకారణ్యం నెత్తుటితో తడిచింది. పేదల రాజ్య స్థాపన, వర్గ రహిత సమాజం, కార్మిక కర్షక విప్లవం పేరుతో సాగిన సాయుధ గెరిల్లా పోరాటం ఇప్పుడు అత్యంత క్లిష్టమైన చారిత్రక కూడలిలో నిలబడింది. 2026, మార్చి 31.. ఇప్పుడు భారత అంతర్గత భద్రతా చరిత్రలో, ప్రత్యేకించి కమ్యూనిస్టు సాయుధ పోరాట చరిత్రలో ఒక నిర్ణయాత్మకమైన మలుపుగా మారబోతున్న తేదీ. కేంద్ర ప్రభుత్వం, ప్రత్యేకించి హోంమంత్రి అమిత్ షా విధించిన ఈ డెడ్‌లైన్, దేశవ్యాప్తంగా మావోయిస్టు పార్టీ పునాదులను తీవ్రంగా కదిలిస్తోంది. 'ఆపరేషన్ కగార్' పేరుతో రాజ్యం నిర్దాక్షిణ్యంగా మోపుతున్న ఉక్కుపాదం, మరోవైపు కేంద్ర కమిటీ సభ్యుల నుంచి ఏరియా కమాండర్ల వరకు కొనసాగుతున్న వరుస లొంగుబాట్లు ఎర్ర జెండా ఉనికినే తీవ్రంగా ప్రశ్నార్థకం చేస్తున్నాయి*



### విప్లవ శిబిరంలో మృత్యు భయం... మార్చి 31 అల్టిమేటం పరమార్థం

సాయుధ రైతాంగ విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవాలనే మార్క్సిస్టు, లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతాలకు ఇప్పుడు ఊహించని అతిపెద్ద పరీక్ష ఎదురైంది. భారత ప్రభుత్వం మావోయిజాన్ని కూకటివేళ్లతో పెకిలించడానికి దృఢ నిశ్చయంతో ఆపరేషన్ కగార్‌కు శ్రీకారం చుట్టింది. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని సంపూర్ణ నక్సల్స్ రహితంగా (Maoistfree India) మారుస్తామని అమిత్ షా చేసిన ప్రకటన కేవలం ఒక రాజకీయ నినాదం కాదు, అదొక అత్యంత వ్యూహాత్మక సైనిక, మరియు మానసిక దాడి. ఈ గడువు సమీపిస్తున్న కొద్దీ అజ్ఞాతంలో ఉన్న దళ నాయకుల్లో, కేంద్ర కమిటీ సభ్యుల్లో తీవ్రమైన అంతర్మథనం, ఆందోళన మొదలయ్యాయి. ఒకవైపు ఆధునిక ఆయుధాలతో కూడిన కోబ్రా కమాండోలు, డ్రోన్ టెక్నాలజీతో భద్రతా దళాల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు బస్తర్, కుర్రెగుట్ట లాంటి దట్టమైన అటవీ ప్రాంతాలను అనుక్షణం జల్లెడ పడుతున్నాయి. మరోవైపు మృత్యువు లేదా లొంగుబాటు అనే రెండే కఠిన ప్రత్యామ్నాయాలను బూర్జువా రాజ్యం వారి ముందుంచింది. వర్గ పోరాటంలో అసువులు బాసిన అమరుల ఆశయాలకంటే, అనుక్షణం ప్రాణాపాయం అంచున నిలబడిన వాస్తవిక భయానక పరిస్థితి వారిని లొంగుబాటు దిశగా నడిపిస్తోంది. ప్రభుత్వమిచ్చిన గడువు ముగిస్తే దళాల మనుగడ అసాధ్యమన్న సంకేతాలు విప్లవ శ్రేణుల్లో మున్నెన్నడూ లేని గందరగోళాన్ని సృష్టించాయి.

### కుప్పకూలుతున్న నాయకత్వం... సైద్ధాంతిక పునాదులపై బూర్జువా దాడి

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో దమనకాండలను, నిర్బంధాలను ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితి అత్యంత భిన్నంగా, ప్రమాదకరంగా ఉంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా 180కి పైగా జిల్లాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టులు, నేడు కేవలం మూడు నాలుగు జిల్లాలకే, అదీ పరిమిత భౌగోళిక ప్రాంతానికే కుదించుకుపోవడం వారి వ్యూహాత్మక వైఫల్యానికి, రాజ్య అణచివేత పైచేయికి అద్దం పడుతోంది. సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో ఎర్ర కారిడార్‌గా పిలుచుకునే ఆంధ్రాలోని తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతి వరకు ఉన్న విస్తృత ప్రాంతంలో ఇప్పుడు భద్రతా దళాల బూట్ల చప్పుడు, హెలికాప్టర్ల గర్జనలు మాత్రమే వినిపిస్తున్నాయి. అగ్రశ్రేణి నాయకులు, సైద్ధాంతిక దిక్సూచులుగా భావించే కేంద్ర కమిటీ సభ్యులు సైతం పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడం క్షేత్రస్థాయి క్యాడర్ లో నైతిక స్థైర్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. శ్రామికవర్గ అగ్రగామి పార్టీగా ఎంతో గర్వంగా చెప్పుకునే మావోయిస్టు పార్టీ, దళాల మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం, ఆయుధాలుఆహార సరఫరా చైన్ పూర్తిగా తెగిపోవడంతో అస్తిత్వ పోరాటం చేస్తోంది. ఇది కేవలం భౌతికమైన దాడి మాత్రమే కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థ మావోయిస్టుల సైద్ధాంతిక స్థైర్యంపై చేస్తున్న అత్యంత పదునైన మానసిక యుద్ధం.

### మారుతున్న సామాజిక ముఖచిత్రం... బ్యాలెట్ వైపు ఆదివాసీల అడుగులు

సాయుధ పోరాటానికి దశాబ్దాలుగా ఊపిరి పోసిన అడవి బిడ్డలు, పీడిత వర్గాలు, ఆదివాసీలు ఇప్పుడు కనీస మౌలిక సదుపాయాలను, అభివృద్ధి ఫలాలను తీవ్రంగా కోరుకుంటున్నారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చిన ఎర్ర జెండా అగ్ర నాయకత్వానికి, క్షేత్రస్థాయిలో వేగంగా మారుతున్న సామాజిక, ఆర్థిక వాస్తవాలకు మధ్య పూడ్చలేనంత అంతరం పెరిగిపోయింది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా అటవీ ప్రాంతాల్లోకి రోడ్లు వేయడం, మొబైల్ టవర్లు నిర్మించడం, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయడం స్థానిక గిరిజనులను తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందనే చైనా విప్లవ పంథా సిద్ధాంతం కంటే, ప్రజాస్వామ్య బ్యాలెట్ బాక్స్, తమ పిల్లల భవిష్యత్తు, శాంతియుత జీవనం వైపు యువత ఆకర్షితులవుతున్నారు. స్థానికుల నుంచి ఇన్ఫార్మర్ వ్యవస్థ బలపడటం మావోయిస్టులకు ఊపిరాడకుండా చేస్తోంది. ఇదే సమయంలో మార్చి 31 గడువును ప్రభుత్వం ఒక బ్రహ్మాస్త్రంగా ప్రయోగించింది. ఈ గడువులోగా లొంగిపోతే ఆకర్షణీయమైన పునరావాస ప్యాకేజీలు, క్షమాభిక్ష ఉంటాయని, లేనిపక్షంలో వినాశనం తప్పదని పంపిన స్పష్టమైన సందేశం విప్లవోద్యమ మూలాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఆకర్షణ, మరియు భయం రెండూ కలగలిసి దళాల్లో సామూహిక లొంగుబాట్లకు దారితీస్తున్నాయి.

### చారిత్రక సంధి దశ...సాయుధ విప్లవ అధ్యాయానికి ముగింపేనా?

కార్మిక కర్షక రాజ్యం కోసం దశాబ్దాలుగా ప్రాణాలను పణంగా పెట్టి సాగిన సాయుధ గెరిల్లా పోరాటం ఇప్పుడు తన చారిత్రక ప్రస్థానంలో ఒక నిర్ణయాత్మక సంధి దశకు చేరుకుంది. మార్చి 31 తర్వాత దండకారణ్యం ఎవరి వశం అవుతుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద ఉత్కంఠ. వందలాది మంది దళ సభ్యులు లొంగిపోవడం కేవలం ప్రాణభయంతో తీసుకున్న నిర్ణయం మాత్రమే కాదు, మారిన పరిస్థితుల్లో సాయుధ పోరాట పంథా ఆచరణాత్మకతపై వారిలోనే తలెత్తిన తీవ్రమైన సైద్ధాంతిక గందరగోళానికి కూడా ఇది సజీవ నిదర్శనం. భద్రతా బలగాల పటిష్టమైన వలయంలో ఆపరేషన్ కగార్ క్లైమాక్స్ కు చేరుకున్న ఈ తరుణంలో, మావోయిస్టులు తమ సైద్ధాంతిక, వ్యూహాత్మక పంథాలను మార్చుకుని కొత్త రూపంలో పోరాటాన్ని నిర్మిస్తారా? లేక ప్రభుత్వ ఉక్కుపాదానికి బలవుతూ, తమ ఉనికిని కోల్పోయి చరిత్ర పుటల్లో ఒక నెత్తుటి అధ్యాయంగా మాత్రమే మిగిలిపోతారా అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఏప్రిల్ 1వ తేదీన ఉదయించే సూర్యుడు దండకారణ్యంలో దశాబ్దాల చీకట్లను పారద్రోలి, తుపాకుల మోతలకు బదులుగా శాంతి, అభివృద్ధి జీవనదులను పారిస్తాడని యావత్ దేశం ఉత్కంఠగా ఆశిస్తోంది. మార్చి 31.. ఒక విప్లవానికి ముగింపు మాత్రమే కాదు, ఒక కొత్త శాంతియుత శకానికి నాంది కూడా కావొచ్చు!

**- గడల నరసింహారావు,**
**సీనియర్ జర్నలిస్ట్. ఖమ్మం**

# పిఆర్‌సి నివేదికపై జాప్యమేలా?



2023 శాసనసభ ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు 7డిసెంబర్ 2023 నాడు చేపట్టింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడుస్తున్న దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ముఖ్యమైన అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నది. విద్యారంగంలో మాత్రం కొంత రూటు మార్చి కొత్త సమస్యలను సృష్టిస్తున్నది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మా ప్రభుత్వం రాగానే కొత్త పిఆర్సిని ప్రకటించి ఆరు నెలలలోగా సిఫారసులను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు సిఫారసులు కమిషన్ నుండి తెప్పించుకోలేదు. పైగా మొదటి వాయిదా ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 24 వరకు ఆరు నెలలు, రెండవ వాయిదా అక్టోబర్ 24 నుండి 31 మార్చి 2026 వరకు, మూడవ వాయిదా మార్చి 2026 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు ముచ్చటగా మూడోసారి వాయిదా వేసి ఉపాధ్యాయ, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలను స్థిరీకరించి తాజాగా వేతనాలను సవరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వేతన సవరణ సంఘం సిఫారసులు చేయాల్సిన అవసరం ఉంటది. వేతన సవరణ సంఘం ప్రతిపాదించే పిఆర్సి తాజా ద్రవ్యోల్బణం, ఐదేళ్లలో ధరల స్థిరీకరణ సూచికను పరిశీలించాలి. గత పిఆర్సి నివేదికలను పరిశీలించి లోపాలను సవరించి వేతన సవరణ తేదీ నాటికి ఉన్న మూలవేతనం, కరువు భత్యం, ఫిట్మెంట్లను కలిపి వచ్చిన మొత్తాలను తాజాగా మూల వేతనాలుగా పూర్తి చేసి తాజా మాస్టర్ స్కేల్, ఇంక్రిమెంట్లు శాస్త్రీయంగా ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత కమిటీకి ఉంటుంది. పిఆర్సిలు రూపుదిద్దుకోవడం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అనేక పోరాటాలు చేసి తమ హక్కుగా సాధించుకున్నారు. అలాంటి హక్కును కాలరాసే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు విడనాడుకోవాలి. పిఆర్సిల మధ్య సంవత్సరాలుగా జాప్యాలను నివారించాలి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పొట్ట కొట్టకూడదు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి పిఆర్సి గడువు 2023 జూన్ 30వ తేదీతో ముగిసింది. 1 జులై 2023 నుండి తెలంగాణ రాష్ట్రం రెండో పిఆర్సిని ఇవ్వాల్సి ఉంది. కేసీఆర్ సర్కార్ 2 అక్టోబర్ 2023న రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్ ఎన్. శివశంకర్ ను చైర్మన్ గా నియమిస్తూ వేతన సవరణ సంఘాన్ని నియమించింది. ఆరు నెలల్లోగా రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది. అనేక పర్యాయాలు చర్చించి ఉద్యోగ సంఘాల నుండి ప్రతిపాదనలు స్వీకరించింది. సుదీర్ఘ కసరత్తు తరువాత కొన్ని నెలల క్రితమే పిఆర్సి నివేదిక సిద్ధమైంది. రిపోర్టును సమర్పించేందుకు అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు. కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు సరి కదా ఉద్యోగ వర్గం కండ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం 2026 బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయిస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశించారు. కానీ అందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేవలం రూ. 26,674 కోట్లు (8.22%) కేటాయించింది. అందులో పిఆర్సి ఊసేఎత్తకుండా ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గాలలో నిరాశ నిస్పృహలకు లోనయ్యే విధంగా వ్యవహరించింది. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి వేతన సవరణ సంఘాన్ని పిలిచి నివేదిక తెప్పించుకొని పిఆర్సి అమలు చేస్తారని ఆశించారు. కానీ ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వ ఆలోచన సమస్యల నుండి ఒడ్డెక్కే దాకా ఓడ మల్లయ్య ఒడ్డెక్కాక బోడ మల్లయ్య అనే చందంగా ఉంది. గత బడ్జెట్ కంటే .67 శాతాన్ని పెంచి చేతులు దులుపుకుంది. అసెంబ్లీ లో ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా ప్రభుత్వం దాటేసింది.

తెలంగాణ మొదటి పిఆర్సిని బిశ్వాస్ చైర్మన్ గా 2018 మే 18న కమిటీ ఏర్పాటు చేసి 2021 నుండి 43% ఫిట్మెంట్ తో పిఆర్సిని అమలు చేసింది. ప్రభుత్వంపై ఏడాదికి 12,595 కోట్ల అదనపు భారం పడిన కరోనా కష్టాలు వెంటాడినా రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల పాత్రను గుర్తించి భారాన్ని భరించేందుకు సిద్ధపడ్డది. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఈ సమాజంలో అంతర్భాగమే. మూడు, నాలుగు దశాబ్దాల పాటు సమాజాభివృద్ధిలో, విద్యాభివృద్ధిలో ఎనలేని సేవ చేసి తమ రక్తాన్ని చెమటగా ధారపోసి ప్రజలకు సేవ చేస్తున్నారు, ఇలాంటి వర్గాల వారిని చిన్నచూపు చూడడం వారి పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం సరైంది కాదు. ప్రస్తుత ముఖ్యమంత్రి జీతాలు పెంచాలంటేనే జంకుతున్నారు.

ఒకసారి నన్ను కోసినా పైసలు లేవు అని, మరొకసారి మీకు జీతాలు పెంచి ఉప్పు, పప్పు, పెట్రోల్ ,డీజిల్ ధరలు పెంచాలా ? లేక రైతు భరోసా, కల్యాణ లక్ష్మి పథకాలు, సామాజిక పెన్షన్లు తగ్గించాలా అంటూ ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రశ్నిస్తూ ఉన్నారు. ఈ మాటలు అసంజసమైనవి, అత్యంత ప్రమాదకరమైనవి. ప్రజలకు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు అగాధాన్ని పెంచి దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. హామీలు ఇచ్చి గట్టెక్కిన పాలకులు అరుపులు,పెడబొబ్బలతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్నా పిఆర్సి నివేదికను తెప్పించుకోకుండా అమలు చేయకుండా గత ప్రభుత్వంపై ఆడిపోసుకుని పబ్బం గడుపుకోవడం దుర్మార్గమైన ఆలోచన. ప్రభుత్వం తాను అనుకున్న పథకాలకు వేల కోట్లు మంజూరు చేస్తూ అందాలకు, విందులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఖజానా ఖాళీ అయిందని చెప్పడం ఎంతవరకు సమంజసం. సెప్టెంబర్ 2026 వరకు పిఆర్సి నివేదికను వాయిదా వేయడం సరైన పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకొని పిఆర్సి నివేదికను తెప్పించుకొని ఐదు శాతం ఐఆర్ తో పాటు 40% ఫిట్మెంట్ తో 1 జులై 2023 నుండి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. లేనియెడల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల నుండి తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుంది.



**- జి. తిరుపతిరెడ్డి,**
**టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు,**
**98663 06366**

## అమెరికా సామ్రాజ్యవాదం..

# ప్రపంచ పరిణామ దిశ

ఇరాన్ లో 1979లో ఇస్లామిక్ విప్లవానికి ముందు ఇజ్రాయిల్ మరియు ఇంపీరియల్ స్టేట్ ఆఫ్ ఇరాన్ దేశాల మధ్య సాధారణ సంబంధాలు ఉండేవి. 1979 కన్నా ముందు ఉన్న మహమ్మద్ రేజ్ షా పహ్లావి అనే ఇరాన్ రాజు నియంతృత్వ ధోరణి, అవినీతి, విలాసవంతమైన జీవితం మరియు ముఖ్యంగా పాశ్చాత్య అనుకూల రాజకీయం ఇరాన్ ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. పాశ్చతీకరణ పేరుతో ఇరాన్ సంస్కృతిని ఆధునికరించే పేరుతో పాశ్చాత్య దేశాల అమెరికా సంస్కృతిని రుద్దడం మత పెద్దలకు నచ్చలేదు. అప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం, పెరగడం నిరుద్యోగం, పేదరికం మూలంగా సాధారణ ప్రజలు అప్పటి మత గురువు అయతొల్లా రుహోల్లా ఖమేనీ తన ప్రసంగాల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచి విప్లవం వైపు నడిచేలా చేయగలిగారు. తద్వారా 1979 జనవరి 16 రోజున షా మహమ్మద్ రేజ్ పహ్లావి దేశం విడిచి పారిపోయారు. 1979 వ సంవత్సరం ఏప్రిల్ లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో 98% ఇరాన్ ప్రజలు అధికారికంగా ఇంపీరియల్ స్టేట్ ఆఫ్ ఇరాన్ ను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ గా పేరు మార్చడానికి తమ ఆమోదాన్ని తెలియజేశారు. 1979 వ సంవత్సరంలోనే రుహొల్ల ఖమేని అధికారాన్ని చేపట్టి విద్యావ్యవస్థ, న్యాయ వ్యవస్థ మరియు సామాజిక విలువలపై షరియా చట్టాలు (ఇస్లామిక్ చట్టాలు) అమలు చేశారు. పాశ్చాత్య ప్రభావం తగ్గించబడింది. 1979లోనే ఇరాన్ లో అమెరికా రాయబార కార్యాలయం ముట్టడి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 444 రోజులపాటు పదుల సంఖ్యలో ఉన్న అమెరికన్ అధికారులను నిర్బంధించారు. అమెరికాను గ్రేట్ సాటర్న్ (పెద్ద సైతాన్) అని పిలిచారు. 1989వ సంవత్సరంలో జూన్ మూడవ తేదీన అయతొల్లా రుహోల్లా ఖమేని మరణం తర్వాత అయతొల్లా అలీ ఖమేని రెండవ సుప్రీం గా అధికారాన్ని చేపట్టారు. అయతొల్లా అనేది షియామతంలో అత్యున్నత స్థాయి హోదా.

1979 వ సంవత్సరంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ఇజ్రాయేల్ ను శత్రుదేశంగా ప్రకటించి దౌత్య సంబంధాలను తెంచుకుంది. అప్పటినుండి ఇజ్రాయిల్ ఇరాక్ ల మధ్య కొన్ని దశాబ్దాలుగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇజ్రాయిల్, అరబ్ దేశాలు, బహిరన్, ఈజిప్ట్ దేశాలు కూడా కొన్ని తిరుగుబాటు సంస్థలతో కలిసి పరోక్షంగా ఇరాన్ పై ఘర్షణ వాతావరణాన్ని కొనసాగించాయి. ప్రతిగా ఇరాన్,సిరియా కొన్ని మిలిటరీ శక్తులు లేదా తిరుగుబాటు సంస్థలు లేదా ప్రాంతాలు లెబనాన్, అమాస్ (గాజా) మరియు హౌతి (యెమన్) ల ద్వారా ఇజ్రాయేల్ పై ప్రతిదాడిని ఘర్షణ వాతావరణం కొనసాగించాయి. వీటినే ప్రాక్సి యుద్ధాలు అంటారు. ఒక దేశంలో ఉన్న తిరుగుబాటు దారులకు సంస్థలకు ఇతర దేశాలు ఆయుధాలు, నిధులు మరియు శిక్షణ మద్దతు ఇచ్చి ఆయా దేశాలలో అంతర్గత కల్లోలాలను సృష్టించడం వంటి వాటిని ప్రోత్సహించడం చేస్తాయి. తద్వారా ఆయా దేశాలు వాటి యొక్క వ్యూహాత్మక లక్ష్యాలను సాధించుకోవడం, సైనికులను కోల్పోకుండా రక్షించుకోవడం, అంతర్జాతీయ వేదికల మీద తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకోవడానికి



ఉపయోగించుకుంటారు. ఇరాన్ అణ్వాయుధాల నిల్వలను పెంచుకుంటుందని, అది తమ ఉనికికే ప్రమాదం అని భావించిన ఇజ్రాయిల్ అమెరికాతో కలిసి ఇరాన్ తో తీవ్ర ఘర్షణ వాతావరణాన్ని కొనసాగిస్తుంది. అందులో భాగంగానే ఇరాన్ సైన్యంలో శక్తివంతమైన కమాండర్ జనరల్ ఖాసిం సులేమాన్ ను 2020వ సంవత్సరంలో జనవరి మూడవ తేదీన ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎంక్యూ9 క్షిపణి ద్వారా కాన్వాయ్ పై దాడి చేసి చంపి వేసింది. పదులకొద్దీ ఇరాన్ అణు శాస్త్రవేత్తల హత్యలు మరియు సైనిక స్థావరాలపై దాడులు ప్రారంభించింది. 2026వ సంవత్సరం ప్రారంభంలో ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణంలో అమెరికా ఇజ్రాయిల్ పక్షాన చేరి తన సామ్రాజ్యవాద కోరికతో పశ్చిమాసియాలో ఉన్న వనరులను గుప్పిట్లోకి తీసుకొని, ప్రపంచాన్ని శాసించాలనే దురాలోచనతో 2026 వ సంవత్సరం ఫిబ్రవరి 28వ రోజున ఆపరేషన్ డికాపిటేషన్ స్ట్రైక్ పేరుతో ఇరాన్ పై యుద్ధాన్ని ప్రారంభించింది. ఇరాన్ చుట్టూ పక్కల గల గల్ఫ్ దేశాలలో అమెరికాకు ఉన్న ఎయిర్ బేసుల ద్వారా యుద్ధాన్ని కొనసాగిస్తుంది. మొదటి రోజే అమెరికా ఇరాన్ సుప్రీం లీడర్ ను హతమార్చగలిగింది. తద్వారా అమెరికా ఇరాన్ లో ఉన్న వనరులను చేజిక్కించుకొని తన అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి వనరులను గుత్తాధిపత్యంగా చేజిక్కించుకోవచ్చు అని, యుద్ధం 4,5 రోజులలో ముగుస్తుంది అని తప్పుడు అంచనాలు వేసుకుని ముందుకు వచ్చారు. కానీ ఇరాన్ తన శక్తి యుక్తులన్నింటినీ కూడ తీసుకొని ఎంతో దీటుగా అగ్ర రాజ్యానికి కొరకరాని కొయ్యగా మారి ఇటు ఇజ్రాయిల్, అమెరికా యుద్ధ విమానాలను కూలుస్తూ శత్రువుకు స్థావరంగా మారిన ఎయిర్ బేస్లను ధ్వంసం చేస్తూ ప్రతిఘటిస్తుంది. కానీ అమెరికా అధ్యక్షులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ ఇంకా ఇరాన్ లో చేయడానికి ఏమీ లేదు అని యుద్ధం మొదలైన 7 నుండి 8 రోజులలో అన్నారు. కానీ ఇప్పటికీ 25 రోజులు గడిచింది యుద్ధం కొనసాగుతూనే ఉంది. కానీ అమెరికా దాడుల వల్ల ఇరాన్ ప్రపంచము ఆయువు పట్టు మీద నొక్కుతుంది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గం ద్వారా రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు 25% పైగా హార్మోస్ జల సంధి గుండానే వెలుతుంది.2024 సంవత్సరం నాటి లెక్కల ప్రకారం ప్రతిరోజు సుమారు రెండు కోట్ల బ్యారెళ్ళ చమురు ఈ మార్గం ద్వారా రవాణా అవుతుంది. సౌదీ అరేబియా,ఇరాన్, యూఏఈ, కువైట్ మరియు ఇంకా కొన్ని దేశాలు తమ ముడిచమురును ప్రపంచ మార్కెట్లకు పంపడానికి ఏకైక సముద్రమార్గం హార్మోజ్. ముఖ్యంగా మన భారతదేశం 40% నుండి 60 శాతం వరకు ముడిచమురు ఈ జల సంధి ద్వారానే దిగుమతి చేసుకుంటుంది. ఒక నిర్ణీత ప్రదేశంలో ఈ జల సంధి వెడల్పు 33 కిలోమీటర్లు మాత్రమే. దీనిని చౌక్ పాయింట్ అని కూడా అంటారు. ఇరాన్ తన పట్టు నిలుపుకునేందుకు హార్మోజ్ జల సంధిని నియంత్రించడం ద్వారా ప్రపంచ ఇంధన అవసరాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా ఆయా దేశాలలో స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, ఇంధన ధరలు పైకి ఎగబాకడం, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటడం, తదితర వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనబడుతుంది. పౌరులు అందరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఇబ్బందులు అన్నింటికి కారణం అమెరికా. అమెరికా యొక్క సామ్రాజ్యకాంక్ష, ఆధిపత్య ధోరణి,సహజ వనరులను ఒడిసిపెట్టి ప్రపంచాన్ని గుత్తాధిపత్యంగా కబళించాలి. తన కను సన్నలలో నడపాలని కోరిక.

ఇప్పటికైనా అమెరికా మేల్కొని తాను పెద్దన్నగా, పెద్ద దేశంగా, పెద్ద మనసు చేసుకొని ప్రపంచ నోబెల్ శాంతి బహుమతి కోరుకుంటున్న అధ్యక్షులు స్పందించి, కొన్ని దేశాలపై, కొన్ని రోజుల కిందట వేసిన ప్రతికార టాక్స్ రద్దుచేసి, యుద్ధం ఆయా దేశాలలో అమెరికా పై తీవ్ర ద్వేషాన్ని పెంచేదిగా ఉంది.ప్రస్తుత ప్రపంచంలో మనుషులకు కావలసిన కనీస అవసరాలు అయినా కూడు,గూడు, గుడ్డ అందాలంటే మరొక కనీస అవసరం అయినా ఇంధన వనరులను ఒడిసి పట్టుకోవాలని అత్యాశను వదులుకొని ఆయా దేశాల ఎదుగుదలలో తన ఎదుగుదలను కోరుకోవాలి. అంతేకాని ఎదుగుతున్న దేశాలను నష్టపరుస్తూ నేను పైకి వెళతాను అంటే తీవ్రంగా నష్టపోయేది అమెరికా, అమెరికా ప్రజలే.

ప్రపంచ శాంతిని కాపాడాల్సిన ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి చోద్యం చూస్తున్నాయి. ఇప్పటికైనా ఐక్యరాజ్యసమితి చొరవ చూపి అమెరికా దూకుడును కట్టడి చేసి,తాను ప్రాథమికంగా ఎంచుకున్న లక్ష్యాలను నెరవేర్చి ప్రపంచ శాంతిని కాపాడాలని ప్రపంచ మానవాళి కోరుకుంటుంది. ఆ విధంగా జరగాలని కోరుకుందాం.



**- అమ్మన నరసింహారెడ్డి,**
**టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా నాయకులు**

# పేదల సొంతింటి కల సాకారం

### బత్తులనగర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బత్తులనగర్ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పి ఎ సి ఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సర్పంచ్ తాటి వాణీ , ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు హాజరయ్యారు. వారు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నారు. లబ్ధిదారులకు అభినందనలు లబ్ధిదారులైన సోందె గోవింద్-కోటమ్మ కుటుంబ సభ్యులను అభినందించిన అతిథులు, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. పేదల సొంతింటి కల నెరవేరడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం - ప్రతి పేదకు ఇల్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యం పేదలకు పక్కా ఇల్లు కల్పించడమేనని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు భద్రతతో పాటు గౌరవం కూడా లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నాగిరెడ్డి , మాజీ సర్పంచ్ కోడెం వెంకటేశ్వర్లు గారు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

### భద్రాచలం ఆయుష్ ఆసుపత్రిలో

# అనియమిత సమయాలు – ప్రజల ఆగ్రహం



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణం లో ఉన్న ఆయుష్ ఆసుపత్రిలో అనియమిత సేవల సమయాలు ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తున్నాయి. ఆసుపత్రి నిర్ణయించిన సమయాలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. సమయపాలన లోపం రోగులు ఉదయం ఆసుపత్రికి వచ్చినప్పటికీ, వైద్యులు ఆలస్యంగా రావడం లేదా కొన్నిసార్లు అందుబాటులో లేకపోవడం వల్ల గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. దీంతో చికిత్స ఆలస్యమవుతోందని స్థానికులు చెబుతున్నారు. రోగుల ఇబ్బందులు ప్రత్యేకంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సమయానికి వైద్యసేవలు అందక తీవ్రంగా నష్టపోతున్నారు. రోజంతా వేచి చూసినా సరైన సేవలు అందక తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, సేవలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు ఆసుపత్రిలో నిర్దిష్ట సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోగ్య సేవలు సమయానికి అందితేనే ప్రజలకు నమ్మకం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

# గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యం

### ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఏసిపి వసుంధర





**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని సింగరేణి వసతి గృహాల సమీపంలో జామాయిల్ తోటలో గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యమయింది. పశువుల కాపరుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడికి సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్యలో ఉండవచ్చునని, మృతదేహానికి నీలిరంగి ప్యాంట్, కుడి చేతికి ఎరుపు రంగు దారం కట్టి ఉందని, దవడ ప్రాంతంలో సర్జరీ జరిగి ఐరన్ ప్లేట్ పెట్టి ఉన్నదని గుర్తించారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసిపి వసుంధర మాట్లాడుతూ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహం పూర్తిగా శిథిలం కావడంతో మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతిని వివరాలు తెలిసినవారు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: ఎస్.హెచ్.ఓ ఫోన్: 8712659167, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఫోన్: 8712551362

### క్వారీలో పడి మృతిచెందిన

# చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

### ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో క్వారీలో పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యానని ఆరోపించారు. ఊరు సమీపంలో అక్రమంగా క్వారీలకు అనుమతులు ఇచ్చి చిన్నారుల ప్రాణాలను బలి తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అని అన్నారు. అక్రమ క్వారీలకు అనుమతులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మృతుల కుటుంబాలకు రెండు కోట్ల అష్ట పరిహారంతో పాటు కుటుంబంలోని సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోలేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుంగ హరికృష్ణ, ఆధార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి కేసులలో నిందితుడిపై పీడీయాక్ట్ నమోదు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామానికి చెందిన షేక్.మున్వర్ గంజాయి అక్రమ రవాణా చేస్తున్నందుకు 2024,2025 సంవత్సరాలలో బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ నందు రెండు (02) కేసులు,2024 లో లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ నందు (01) కేసు, 2024లో ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో (01)మ కేసు నమోదు చేయడం జరిగింది. చివరిగా 2025 ఏప్రిల్ నెలలో దుండిగల్ పిఎస్ లో 98 కేజీల గంజాయిని సరఫరా చేస్తూ దొరకగాఅక్కడ కూడా కేసు నమోదు చేయడం జరిగింది. ఈ ఐదు కేసులలో షేక్.మున్వర్ మొత్తం 287 కేజీల గంజాయిను సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నందున అతనిపై పిఐటి ఎన్డీపిఎస్ యాక్ట్ కొరకు పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ సూచనలతో సీఐ కె సతీష్ ప్రతిపాదించగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పర్యవేక్షణలో ప్రతిపాదిత ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి సీఐడి అడిషనల్ డీజిపి చారు సిన్హా ఐపిఎస్ ఫిబ్రవరి 16 వ తేదీన డిటెన్షన్ ఆర్డర్ (నిర్బంధ ఉత్తర్వులు) ను జారీ చేయగా అదే నెల18 వి తేదీన డిటెన్షన్ ఆర్డర్ ప్రతులను షేక్.మున్వర్ కు అందజేసి చేసి అతనిని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ఈ నెల 17 వ తేదీన అడ్వైజరీ బోర్డు (సలహా మండలి) షేక్.మున్వర్ పై వచ్చిన నిర్బంధ ఉత్తర్వులపై విచారణ జరిపి భౌతిక,సాంకేతిక ఆధారాలను పరిశీలించి, పీఐటి ఎన్ డి పి ఎస్ యాక్ట్ ను సమర్థిస్తూ సంవత్సర కాలం చర్లపల్లి జైల్లో నిర్బంధించాలని ఉత్తర్వులు జారీ చేశారు.సిఐ సతీష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని,ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపించే గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను సేవించినా,సరఫరా(రవాణా) చేయడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని,వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో పీడియాక్ట్ లను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.అంతే కాకుండా పట్టుబడిన నిందితులు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులను కూడా కోర్టు ఉత్తర్వులతో జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

# సింగరేణి సొమ్మును దోచుకుంటే ఎలా..?

## కంపెనీ పరిరక్షణ కోసం ఉద్యమిద్దాం

- ప్రభుత్వం నుండి రావాల్సిన 50 కోట్ల బకాయిలను యాజమాన్యం వసూలు చేయాలి
- సింగరేణి ఆధ్వర్యంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలి
- పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డును కొనసాగించాలి
- సిపిఐ పార్టీ జాతీయ నాయకులు కే.నారాయణ
- సింగరేణి పరిరక్షణ కోసం హెడ్ ఆఫీస్ ముందు భారీ ధర్నా
- ప్రభుత్వం యాజమాన్యం విధానాలను నిరసిస్తూ నేలపై పడుకుని నిరసన తెలిపిన సిపిఐ పార్టీ జాతీయ నేత నారాయణతో పాటు ప్రధాన నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీని ఉద్యమాలతో పరిరక్షించుకుంటామని సిపిఐ పార్టీ జాతీయ నేత డాక్టర్ కె.నారాయణ అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన సింగరేణి పరిరక్షణ కొరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా విజయవంతమైంది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కే.నారాయణ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్త పరిశ్రమలు లేకపోవడం వల్ల సింగరేణి కంపెనీ విస్తరించిన ప్రాంతాలలో నిరుద్యోగ సమస్య తీవ్రతరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమలను స్థాపించినట్లయితే నిరుద్యోగ సమస్య కొంతమేరకు తీరుతుందన్నారు. సింగరేణి సొమ్మును గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎంతో దోచుకుందని అదే తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దోచుకోవడం విచారకరమన్నారు. సింగరేణి కంపెనీని పరిరక్షించాల్సింది పోయి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భక్షిస్తుందన్నారు.

**నూతన బొగ్గు గనులను ప్రారంభించాలి..**

సింగరేణి కాలర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నూతన బొగ్గు గనులు ప్రారంభించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన నాయకులు రాజ్ కుమార్, వాసిరెడ్డి సీతారామయ్యలు కోరారు. పెర్క్స్ పై ఇంకామ్ టాక్స్ కంపెనీనే చెల్లించాలన్నారు. మెడికల్ బోర్డు పాత విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.50 వేల కొట్ల బకాయిలను యాజమాన్యం రాబట్టాలని కోరారు. మారు పేర్లు, డిస్మిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. స్వంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చర్ కమిటీలో ఒప్పుకున్నవాటిని అమలు చేయాలని సూచించారు. మెడికల్ అయిన డిపెండెంట్ ఉద్యోగులకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను హైదరాబాదులో ఏర్పాటు చేసి సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన భారీ ధర్నాకు 11 ఏరియాల నుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని హక్కుల కోసం నిన్నందించారు.

**నేలపై పడుకుని నిరసన తెలిపిన సిపిఐ పార్టీ జాతీయ నేత నారాయణ...**

సింగరేణి కార్మికుల విషయంలో ఇటు యాజమాన్యం అటు కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ జాతీయ నాయకులు కే.నారాయణ సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమం సందర్భంగా అక్కడ నేలపై పడుకొని నిరసన తెలిపారు. ఆయనతో పాటుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాతో సహా ఇతర సిపిఐ నాయకులు ఏఐటీయూసీ నాయకులు కార్మికులు సైతం నేలపై పడుకుని తమ నిరసనను తెలియజేశారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని నినాదాలు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సింగరేణి అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని పలువురు నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన నాయకులతో పాటు కిందిస్థాయి నాయకులు అభిమానులు సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు సింగరేణిలో ప్రమాదాలు..

### లక్షల టన్నుల బొగ్గు కోసం ప్రాణాల పణం..?.. ఈ ఘటనలకు బాధ్యత ఎవరిది..?



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఏరియాలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు కార్మికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఫిట్నెస్ లేని వాహనాలతో ఓబీ కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పీకే ఓసి 2, ఓసి4, మణుగూరు ఓసి పరిధిలో పనిచేస్తున్న దుర్గ, గౌరవ్ ఓబీ కంపెనీల వాహనాలపై తీవ్రమైన నిర్లక్ష్యం బయటపడుతోందని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నేతలు విమర్శిస్తున్నారు. అనేక ఓబీ వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకపోయినా, అదే వాహనాలతో పనులు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలపై సింగరేణి యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మిక సంఘం పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. రక్షణ ప్రమాణాలు కేవలం శిక్షణ తరగతులకే పరిమితమై, ఆచరణలో అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం దుర్గ ఓబీ కంపెనీలో జరిగిన విషాదకర ఘటన ఈ నిర్లక్ష్యానికి నిదర్శనమని కార్మిక వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడటం తీవ్ర చర్చనీయాంశమైంది. కాలం చెల్లిన, ప్రమాదకర స్థితిలో ఉన్న వాహనాలతో పనులు చేయించడం వల్ల డ్రైవర్ల ప్రాణాలపై ముప్పు మోస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే ప్రాణాలు పోతాయి... తర్వాత పరిహారం పేరుతో లక్షలు ఇస్తే ప్రాణాలు తిరిగి వస్తాయా..? అంటూ కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. కుటుంబాలు కోల్పోయిన నష్టాన్ని డబ్బుతో పూడ్చగలమా అన్న ఆవేదన వ్యక్తమవుతోంది.ఇలాంటి పరిస్థితుల్లో వరుస ప్రమాదాలకు అసలు బాధ్యత ఎవరిది..? వాహనాల ఫిట్నెస్‌పై పర్యవేక్షణ ఎవరు చేయాలి..? భద్రతా నిబంధనలు అమలు చేయడంలో ఎందుకు విఫలమవుతున్నారు..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఫిట్నెస్ లేని వాహనాలను నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా మేల్కొని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తుందా..? లేకపోతే మరిన్ని ప్రాణాలు బలవుతాయా..? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**లక్షల టన్నుల బొగ్గు కోసం ప్రాణాల పణం..?**

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగంగా కార్మికులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడమే ప్రధాన ధ్యేయంగా మారడంతో రక్షణ సూత్రాలు సైతం పక్కన పడుతున్నాయన్న విమర్శలు కార్మిక వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు ఉత్పత్తి పెరగాలంటే ముందుగా ఓవర్‌బర్డెన్ (మట్టి) తొలగింపు కీలకం. ఈ నేపథ్యంలో ఓబీ కంపెనీలకు అధిక లక్ష్యాలను నిర్దేశించడమే కాకుండా, లక్ష్య సాధనలో వెనుకబడిన ఓబీ సంస్థలపై పెనాల్టీలు విధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా వేగంగా లక్ష సాధన కోసం భద్రతను విస్మరించే పరిస్థితి ఏర్పడుతోందని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. ఇక ఓబీ కంపెనీలలో స్థానికులకు ఉపాధి కల్పన విషయంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక కార్మికులను తీసుకుంటే కంపెనీల నిర్లక్ష్యం బయటపడుతుందన్న భయంతోనే వారిని దూరంగా ఉంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి, చట్టబద్ధంగా చెల్లించాల్సిన హైపవర్ వేతన కమిటీ సూచించిన వేతనాలను ఇవ్వకుండా తక్కువ కూలీకి పనిచేయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.నైపుణ్యం లేని కార్మికులతో ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయించడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్పత్తి లక్ష్యాల కోసం ప్రాణాలను పణంగా పెట్టే విధానం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.లక్షల టన్నుల బొగ్గు సాధన కంటే కార్మికుల ప్రాణాలు ముఖ్యమా కాదా..? అన్న అంశంపై సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సేవ్ సింగరేణి.. చలో కొత్తగూడెం

### ఏఐటియుసి ఆధ్వర్యంలో భారీగా తరలిన కార్మికులు..

**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ సింగరేణి.. చలో కొత్తగూడెం ధర్నా కార్యక్రమానికి సోమవారం వందలాది మంది కార్మికులు తరలివెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సింగరేణి సంస్థ రక్షణ కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి బయలుదేరిన వాహనాలను బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం రాజీ లేని పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. యాజమాన్యం కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీసు బేరర్లు ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, గోలి గంగాధర్, బి. సురేందర్, ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి.రవీందర్, జి. శ్రీనివాస్, జి. శరత్, సాయిప్రకాశ్ చారి తదితరులు హాజరయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులు, కౌన్సిల్, మైన్స్ అండ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్తగూడెం బయలుదేరి వెళ్లారు.

# ఆరోగ్య సేవల విషయంలో నిర్లక్ష్యం చూపొద్దు

- నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం సౌకర్యాలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లాబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి పరీక్షలు నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. అలాగే మందుల గిడ్డంగిని తనిఖీ చేసి అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. రక్త పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలు అందుబాటులో ఉన్న టీకాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల స్థితిగతులు అవసరమైన ఔషధాల లభ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించడంలో వైద్యులు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు .ఈ సందర్భంగా కలెక్టర్ కుక్క కాటుకు గురైన ఒక బాలుడిని పరామర్శించి అతనికి అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సమర్థవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ స్వప్న టిపిఎమ్ఓ ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతి పత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు..**

కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ అశ్వరావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 911/33లో 5.00 గుంటల రిజిస్టర్ భూమి తన పేరున ఉన్నప్పటికీ ఆర్ఎస్ఆర్ సమస్య కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదని తెలిపారు. తన పేరున పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూభారతి విభాగానికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆంగోతు సంతులాల్ సర్వే నంబర్ 239/282లో వ్యవసాయ భూమి ఉన్నదని గతంలో ఇంద్రజల ప్రభ పథకం కింద బోరు విద్యుత్ మంజూరు అయినప్పటికీ మోటార్ మీటర్‌కు సర్వీస్ నంబర్ ఇవ్వలేదని తెలిపారు. తన విద్యుత్ కనెక్షన్ కొనసాగించేలా సర్వీస్ నంబర్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. అల్లపల్లి మండలం చెలగట్టు గ్రామానికి చెందిన కొమరం సారమ్మ, తన భర్త మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని పీజీ(ఎంఏ) వరకు చదువుకున్న తన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికు ఎండార్స్ చేశారు.కొత్తగూడెం మేదరబస్తీ 53వ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్ గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటికి కిన్నెరసాని మంచినీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ నీటి బిల్లులు విధిస్తున్నారని తెలిపారు. నీటి బిల్లులను రద్దు చేసి కొత్త కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎండార్స్ చేశారు. పినపాక, ఏడుళ్ల బయ్యారం, జానంపేట టి.కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు రంజాన్ బక్రీద్ పర్వదినాలలో సామూహిక నమాజ్ నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈద్గా స్థలం కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి పినపాక తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు
# పకడ్బందీ చర్యలు..

- బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి..
- హైవేపై 20 నిమిషాల్లోపు చేరుకునేలా పెట్రోలింగ్..
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్..




**నల్గొండ, మహా :** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి 'జిల్లా స్థాయి రహదారి భద్రత' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్స్), మరణాల సంఖ్యపై పోలీసు శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి భద్రతపై సమాజంలోని అన్ని వర్గాలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల్లో 'సురక్షితంగా చేరుకోండి' కార్యక్రమంపై ప్రజలకు వివరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ సేవలపై రవాణా శాఖ అధికారులు చైతన్యం తీసుకురావాలన్నారు.

**హైదరాబాద్ - విజయవాడ హైవేపై ట్రామా కేర్ సెంటర్..**

జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉన్నందున హైదరాబాద్‌విజయవాడ హైవేపై అత్యవసర వైద్య సేవల కోసం త్వరలోనే 'ట్రామా కేర్ సెంటర్' ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ప్రమాదం జరిగిన 20 నిమిషాల్లోపు పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేలా హైవే పెట్రోలింగ్‌ను పటిష్టం చేయాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలోగా గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రక్షణ చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు.

**తగ్గిన బ్లాక్ స్పాట్లు..ఎస్పీ శరత్ చంద్ర పవార్**

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు జిల్లా యంత్రాంగం తీసుకున్న ఉమ్మడి చర్యల వల్ల గత 18 నెలల్లో ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్ల సంఖ్య 58 నుండి 38కి తగ్గిందని మరణాల సంఖ్య కూడా 7 శాతం మేర తగ్గిందని వివరించారు. అయితే, ఇటీవల కాలంలో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాల్లో ఈ అంశంపై విద్యాశాఖ ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా ముకుందాపురం, మాడుగులపల్లి, నల్గొండ టౌన్, హాలియా, నకరేకల్, దేవరకొండ, చింతపల్లిమాల్ రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.రహదారి ప్రమాదాల నివారణకు విశేష కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీలు ఈ సందర్భంగా అభినందన పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నేషనల్ హైవేస్, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వీడండి క్షేమంగా ప్రయనించండి..

- రోడ్డు భద్రతపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అవగాహన..
- పోలీసు కళాబృందంతో వినూత్నంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం..
- ఆకట్టుకున్న యమధర్మరాజు వేషధారణ

**నల్గొండ టౌన్, మహా :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ పట్టణ క్లాక్ టవర్ సెంటర్లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అతివేగం, అజాగ్రత్త మరియు ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన లేకపోవడం వల్ల జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళాబృందం నిర్వహించిన ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యమధర్మరాజు వేషధారణలో కళాకారులు రహదారిపైకి వచ్చి, హెల్మెట్ ధరించని వాహనదారులకు కలిగే ప్రమాదాలను వివరించడం అందరినీ ఆలోచింపజేసింది. చిన్నారులు తమ నృత్యాల ద్వారా రోడ్డు భద్రతా సందేశాలను ప్రజలకు చేరవేశారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాద సమయాల్లో ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా యువత అతివేగంతో వాహనాలు నడపడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు రోడ్డు భద్రతపై తగిన మార్గదర్శకత్వం ఇవ్వాలని ఎస్పీ కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తమ వెంట అవసరమైన పత్రాలను ఉంచుకోవాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడకూడదని హితవు పలికారు. రాబోయే రోజుల్లో విద్యాసంస్థలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐలు రాము, రాజశేఖర్ రెడ్డి, మహాలక్ష్మయ్య, కరుణాకర్, ఎస్సైలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాలనీలు మురికి కాలువలయ్యాయి

**గత రెండు నెలలుగా ఇదే దుస్థితి.. జిహెచ్ఎంసి అధికారుల పట్టింపు ఏది..**



**రాజేంద్రనగర్, మహా :** మైలార్దేవపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో బిజెపి డివిజన్ అధ్యక్షులు సూర్ రెడ్డి వినయ్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి సోమవారం బస్తీ పర్యటన నిర్వహించారు. దుర్గానగర్‌లోని దుర్గా ప్లే స్కూల్ సమీపంలో గత రెండు నెలలుగా ఓపెన్ డ్రైనేజీ మురుగు నీరు వీధుల్లో పారుతున్నా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని సూర్రెడ్డి వినయ్ రెడ్డి మండిపడ్డారు.నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డ్రైనేజీ వ్యవస్థను సరి చేయలేదు. అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విఫలమయ్యారు.4సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు న్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి అనేది బూచిగా చూపి ఆస్తులు దాచుకోవడానికి పార్టీలు మారుతున్నారు.పిల్లలు రోజూ మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు. డ్రైనేజీ నీరు నిలవడంతో దోమల బెడదతో ప్రజలకు విష జ్వరాలు, వైరల్ వ్యాధులతో బాధపడుతున్నారు. జిహెచ్ఎంసి, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి అధికారులు కనీస స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ లో డ్రైనేజీ వ్యవస్థను సరి చేయని జిహెచ్ఎంసి గ్రేటర్ హైదరాబాద్ విస్తరణలో శానిటేషన్ వ్యవస్థను ఎలా సరిచేస్తుందని ప్రశ్నించారు. దుర్గా నగర్ లోని ఈ దుస్థితి ఉందంటే, వేరే కాలనీలలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో. నియోజకవర్గ ప్రజలు ఆలోచించాలి. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, కేవలం ఫంక్షన్లు, షాపుల ఓపెనింగ్‌లకే పరిమితమయ్యారని విమర్శించారు.ప్రజల ఆరోగ్య లతో ఆడుకుంటున్నా ఈ నిర్లక్ష్య పాలనను మైలార్దేవపల్లి ప్రజలు ఇక సహించరని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి వచ్చే నాయకులకు ప్రజలు తగిన సమాధానం చెప్పడం ఖాయం అని సురెడ్డి వినయ్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆడెకే రాజు, బొమ్మ రాజు, శ్రీనివాస్ యాదవ్, ఆడెకే మహేందర్, అంజనేయులు,వేణు, నిఖిల్, బాబూజీ, సాయి కుమార్ పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన పార్కు, రోడ్లను కాపాడాలి

- ప్రజావాణిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి
- హైడ్రా అధికారులకు ఫిర్యాదు



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలోని పార్క్,రోడ్లును కాపాడాలంటూ సోమవారం ప్రజావాణిలో హైడ్రా అధికారులకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. టీఎన్జీవోస్ కాలనీ లేఔట్ లో పార్క్, రోడ్లు 40 ఫీట్లు, పద్మశాలి పురం నుండి వివేకానంద స్టాచు, శ్రీ రామకృష్ణ సేవా సమితి రోడ్డు కు వెళ్లే రహదారి కబ్జాకు గురైంది. పార్కు, రోడ్లను కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బుద్ధ భవన్ లో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందిస్తూ కాలనీలో కబ్జాకు గురైనా, రోడ్లను, పార్కులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## మైనింగ్ కి వెళ్లే రహదారి పోలీసు బలగాలు,భారీక్రేడ్ల తోమూసివేత

**మైనింగ్ సందర్శనకు వచ్చిన బిఆర్ఎస్ నాయకుల అరెస్ట్..**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధి కోత్వాల్ గూడ రెవిన్యూ పరిధిలోని రాఘవ కన్స్ట్రక్షన్ మైనింగ్‌ను సందర్శించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి సోమవారం కోత్వాల్‌గూడకు వస్తున్నారని సమాచారంతో మైనింగ్ కి వెళ్లే ప్రధాన రహదారిని పోలీసుల బందోబస్తు మధ్య భారీ క్రేడ్లతో రహదారిని పూర్తిగా మూసివేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, సిఐ సత్యనారాయణ గౌడ్, తన సిబ్బందితో కలిసి బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లలకు తరలించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాఘవ కన్స్ట్రక్షన్ పేరుతో రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అనివారియులు జరుపుతున్న అక్రమ మైనింగ్‌ను తక్షణమే ఆపాలి. ప్రజల ఆస్తులను దోచుకుంటూ, పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో క్షమించమని బి ఆర్ ఎస్ నాయకులు మండిపడ్డారు.అరెస్ట్ అయినా వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాంచర్ల శ్రీనివాస్,కోన్నమొల్ల శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ బుర్కుంటాసతీష్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, డివిజన్ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి, దేవరంపల్లి బుచ్చిరెడ్డి, జయసింహ,గుంటి ప్రవీణ్, రఘు యాదవ్, రాజేందర్, వెంకట్ రెడ్డి, చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్, హన్మంత్,కొమ్ము గోపాల్, టీ గౌస్ పాషా, మంచర్ల చిరంజీవి, బాత్కు మహేశ్ యాదవ్, షేక్ మహమూద్, బక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు!

- రైతులకు అవసరమైన వసతులు కల్పించాలి
- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో యాసంగి సీజన్ లో పండించిన ధాన్యం కొనుగోలు చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకు వచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సన్నరకం వరి, ముతక రకాలను వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరు చేయాలని, ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్ లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు, తూనికలు, పొట్టు రిమూవర్, ఫీల్డ్ బ్యాలెన్స్‌లు, తేమ యంత్రం, వంటి అన్ని మౌలిక సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, సివిల్ సప్లైస్ డీ.ఎం హరీష్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పిడి డీఆర్డీఏ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, డీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కారించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2,మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి ,జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న నాటకలు




**ఆలేరు, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బిసి కాలనీలో గత మూడు రోజులు గా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన ప్రవచనం పూజ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా నేడు సురభి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ, చింతామణి, సత్య హరిచంద్ర నాటకలు ప్రదర్శన, గాన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి . ఈ కార్యక్రమ నిర్వాహకులు, నంది అవార్డు గ్రహీత టి రాముతో పాటు ప్రత్యేక రంగస్థల సురభీ నాటక కళాకారులు పాల్గొన్నారు.

## దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిది



**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

**హైదరాబాద్, మహా :** దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిదని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సోమవారం లోక్ భవన్ లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా రాజస్థాన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో హైదరాబాద్ లో ఉంటున్న రాజస్థాన్ వాసులు పాల్గొన్నారు.వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణితో పాటుగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ... దేశంలో సంస్కృతి, సాంప్రదాయాల పరంగా రాజస్థాన్ కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. భగవాన్ శ్రీ రాముడు, జన్మభూమి స్వర్గం కంటే మిన్న అని చెప్పారని.. వారి స్ఫూర్తితోనే రాజస్థాన్ ప్రజలు దేశ అభివృద్ధి, సాంస్కృతిక వికాసంకు గొప్ప సేవ చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. గవర్నర్ సందేశం అనంతరం ఏర్పాటు చేసిన రాజస్థాన్ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి.

## గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేత



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ వార్డు సభ్యులు ఐదు రోజులపాటు శంషాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారంతో ముగిశాయి. పంచాయితీ వార్డు సభ్యులకు మండల ఎంపీడీవో జి మున్ని, మండల ఎంపీ ఓ, ఇతర అధికారులతో కలిసి వార్డు సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పంచాయతీ వార్డు సభ్యులు సహకారం ఉండాలన్నారు. శిక్షణ తరగతులో నేర్చుకున్న మెలుకువలను గ్రామ అభివృద్ధిలో వినియోగించాలన్నారు.

## వట్టినాగులపల్లి భూ బాధితులకు అండగా బీఆర్ఎస్..

**కబ్జాకు గురైన భూములను పరిశీలించిన కేటీఆర్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**వట్టినాగులపల్లి భూ బాధితులకు అండగా ఉంటామన్న కేటీఆర్, బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆ భూములను పరిశీలించారు. అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంపై పోరాటాన్ని బీఆర్ఎస్ మరింత ఉధృతం చేస్తుంది. ఆదివారం అసెంబ్లీ నుండి సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సోమవారం పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావుతో భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఈ సమావేశంలో చర్చించారు .ఈ క్రమంలోనే వట్టినాగులపల్లిలో వెలుగు చూసిన భూకబ్జా ఉదంతంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడిపై వచ్చిన భూకబ్జా ఆరోపణల నేపథ్యంలో, బాధితులకు సంఘీభావం తెలిపేందుకు కేటీఆర్, హరీష్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయిలో వట్టినాగులపల్లి భూములను పరిశీలించారు.

**భూ బాధితులకు భరోసాగా బీఆర్ఎస్...**

వట్టినాగులపల్లిలో భూములు కోల్పోయినట్లు ఆరోపిస్తున్న బాధితులను నేరుగా కలిసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కబ్జాకు గురైనట్లు చెబుతున్న భూములను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. భూ బాధితులకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిస్తూ, ఈ పోరాటాన్ని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ముందుకు తీసుకెళ్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.

**అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారు.....**

అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజాక్షేత్రంలోనే ప్రభుత్వం తీరును ఎండగట్టేందుకు ఈ పర్యటనను కీలకంగా బిఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఈ పర్యటనతో రాజకీయంగా దుమారం రేగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, బిఆర్ఎస్ నేతలు నాయకులు కార్యకర్తలు భూ బాధితులు తదితరులు పాల్గొన్నారు.



## బంగారు మైసమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయల
# పునర్నిర్మాణానికి భూమి పూజ

### మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖబాబురావు..
### మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్

**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ పట్టణంలోని రైతు బజార్ లో పునర్నిర్మాణం చేపట్టనున్న రేణుక ఎల్లమ్మ, బంగారు మైసమ్మ దేవాలయల నిర్మాణానికి సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖా బాబురావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల ఏర్పాటుతో పాటు, మన పూర్వీకుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నదని అన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్వాపురం ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి సాగునీరు రాగానే భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాలువ అభివృద్ధి పనులు పూర్తి చేసి రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు కల్పించారన్నారు. గత ప్రభుత్వం బస్వాపురం ప్రాజెక్టు నుండి కింద భాగానికి పోవు కాలువ పనులు దశాబ్దకాలంగా ప్రారంభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో కాలువలకు మోక్షం లభించిందని, భువనగిరి, వలిగొండ, రైతులకు సకాలంలో నీళ్ళు అందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాడూరి నరసింహ,రంగ క్రిస్టయ్య,చిన్నం శ్రీను,రైతు బజార్ సంఘం అధ్యక్షులు యట్టా నాగరాజు,ఎస్టేట్ ఆఫీసిసర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానంలో గ్యాస్ 'నిల్వలు'
## భారీ రాకెట్ గుట్టురట్టు

**హైదరాబాద్, మహా.** నగరంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న ఎల్పీజీ కొరతను సాకుగా చూపుతూ, ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న పది మంది సభ్యుల ముఠాను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఒక శ్మశాన వాటికలో అత్యంత ప్రమాదకర రీతిలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ మరియు బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ జాయింట్ ఆపరేషన్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు కృత్రిమ కొరతను సృష్టించి, అక్రమంగా లాభం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ వెల్లడించారు. ఈ దాడుల్లో 414 సిలిండర్లతో పాటు వాటి తరలింపునకు ఉపయోగిస్తున్న 11 రవాణా వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 21.88 లక్షలుగా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. అక్రమ నిల్వలు మరియు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ'ని నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ అక్రమ దందాకు ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడు. బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలో ఉన్న ఒక శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేస్తూ, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు దాడి చేసి ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమానితో పాటు డెలివరీ బాయ్స్, డ్రైవర్లు మరియు కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు మరియు ఆటోలు ఉన్నాయని, నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.



# జేజమ్మగా శ్రీలీల?

2009లో 'అరుంధతి'గా బాక్సాఫీస్ వద్ద అనుష్క చేసిన హంగామా అందరికీ తెలిసిందే. అనుష్కను నేటికీ అంతా జేజమ్మ అని ముద్దుగా పిలుచుకుంటారు. ఆమె ఇమేజ్‌పై ఆ పాత్ర ప్రభావం అలాంటిది. సినిమా వచ్చి 17 ఏండ్లయినా గద్వాల్ రాణిగా అనుష్క కనపరచిన రాజసం ఎవరూ మరిచిపోలేదు. అలాంటి ఈ సినిమాను బాలీవుడ్‌లో పునర్నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. టాలీవుడ్ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించనున్న ఈ చిత్రంలో 'అరుంధతి'గా శ్రీలీల నటించనున్నట్టు సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి. తమిళ దర్శకుడు మోహన్‌రాజాను దర్శకుడిగా పరిశీలిస్తున్నారట. ఇదిలావుంటే.. అసలు జేజమ్మ పాత్రకు శ్రీలీల న్యాయం చేయగలదా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో ఉత్పన్నమవుతున్నాయి. రీమేక్ చేసే బదులు, సీక్వెల్ చేస్తే బావుంటుందని మరికొందరు నెటిజన్స్ సలహాలు కూడా ఇస్తున్నారు. అసలు ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



# పర్వీన్ బాబీ బయోపిక్‌లో?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ పర్వీన్ బాబీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానున్నది. జోయా మెహ్రా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో పర్వీన్ బాబీగా త్రిప్తి డిమ్రీ కనిపించనున్నది. పర్వీన్‌బాబీ జీవితంలోని గ్లామర్, వివాదాలు, వ్యక్తిగత పోరాటాలు.. వీటన్నింటినీ సమతుల్యంచేసి, అద్భుతమైన బయోపిక్‌గా ఈ చిత్రాన్ని తెరమీదకు తీసుకురావాలనే ప్రయత్నంలో మేకర్స్ ఉన్నారు. అయితే.. పర్వీన్‌గా త్రిప్తీని ఎంపిక చేయడంపై బాలీవుడ్‌లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గొప్పనటిగా కీర్తింపబడ్డ పర్వీన్‌బాబీ పాత్రకు త్రిప్తి న్యాయం చేయగలదా? అంటూ కొందరు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ డిబేట్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేటయింది. త్రిప్తి డిమ్రీపై మేకర్స్ మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌కి వెళ్లనుంది.



# సౌత్ సినిమాలు చూడటాన్ని ఎంజాయ్ చేస్తా!

స్టార్ హీరోయిన్ రవీనా టండన్ కూతురు రాషా తడానీ అప్పుడే పెద్ద సెలబ్రిటీ అయిపోయింది. చేసింది ఒక్క సినిమా (ఆజాద్)నే అయినా ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక ఆజాద్ మూవీలో ఉయి అమ్మా పాటలో డ్యాన్స్‌తో ఇరగదీసి సెన్సేషన్ అయింది. ఈ బ్యూటీ శ్రీనివాస మంగాపురం మూవీతో తెలుగులో ఎంట్రీ ఇవ్వనుంది. సూపర్‌స్టార్ కృష్ణ నటవారసత్వాన్ని కొనసాగిస్తూ ఘట్టమనేని జయకృష్ణ (రమేశ్‌బాబు తనయుడు) వెండితెరకు హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఈ మూవీలో రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా ఆమె మాట్లాడుతూ.. నాకు దక్షిణాది సినిమాలు చూడటమంటే చాలా ఇష్టం. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్‌బాబు.. ఇలా అందరి సినిమాలు చూస్తుంటాను. వాళ్ల సినిమాలన్నీ కొత్త అనుభూతినిస్తాయి. ఇప్పుడదే ఇండస్ట్రీలో భాగం కావడం సంతోషంగా ఉంది. దీన్ని నేను ఎంజాయ్ చేస్తున్నాను. హీరోలే కాదు, అక్కడ హీరోయిన్స్ రష్మిక మందన్నా, శ్రీలీల.. ఇలా అందరూ స్ఫూర్తిదాయకంగా ఉంటారు. అలాంటి సినీ ప్రపంచంలో భాగమయ్యే అవకాశం లభించినందుకు గర్వంగా ఉంది. నా జర్నీ చక్కగా ముందుకు సాగుతుందనుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. శ్రీనివాస మంగాపురం విషయానికి వస్తే.. ఆర్ఎక్స్ 100, మంగళవారం ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది. మరోవైపు రాషా.. లైకే లైకా అని ఓ హిందీ మూవీ కూడా చేస్తోంది.



# హనీ రోజ్‌కు వేధింపులు.. వీడియో వైరల్..!

మలయాళ బ్యూటీ హనీ రోజ్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేరళలోని ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వెళ్లిన ఆమెతో కొందరు అసభ్యంగా ప్రవర్తించారు. షాపింగ్ మాల్ దగ్గర హీరోయిన్‌తో ఫోటోలు దిగేందుకు ఎగబడ్డారు. వారితో సెల్ఫీ దిగే సమయంలో ఒకరు ఆమె నడుముపై చేతులు వేస్తూ కనిపించారు. దీంతో అసౌర్యానికి గురైన హనీ రోజ్ వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వారి తీరుపై నెటిజన్స్ మండిపడుతున్నారు. సెలబ్రిటీలను అలా వేధించడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మలయాళ బ్యూటీ 2008లో ఆలయం సినిమాతో తెలుగువారికి పరిచయమైంది. ఆ తర్వాత ఈ వర్షం సాక్షిగా (2014) చిత్రంలో నటించింది. దాదాపు దశాబ్ద కాలం గ్యాప్ ఇచ్చాక వీరసింహారెడ్డితో మెరిసింది. ఈ చిత్రంతోనే హనీరోజ్ టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com